రెండవమాలె—నీమనస్సుచలించినదే కాని నిన్ను విడిచిపోయి నదికాదు. ఇఁక నామనస్సో నన్నప్పుడే విడిచి నాలోపల నిలువక పరుగువాఱి పాటపాడినంతసేపును రాజుమీఁదనే యున్నది. నేనిప్పుడేమి పాడితినో యే నెఱుగను.

సత్య—ఓగోసంగీతపడుచులారా ! ఇవిగో కాంచనాంబరాభరణములు రాజుగారనుగ్రహించి దయచేయుచున్నారు. వీనిని బుచ్చుకొనుఁడు.

మాలె—ఓమంత్రిచంద్రా! మేమీభూషణముల నొల్లము. ఈమండు వేసవికాలములో దుస్సహమయిన యాతపముచేత మా దేహమంతయు లోపలను వెలుపలనుగూడ దహించుకొనిపోవుచుండఁగా మాకిప్పుడీయలంకారములెందుకు? బాహ్యతాపమయిన నించుక శాంతించుటకు మీ రాజుగారి శ్వేతచ్ఛత్రము నిచ్చినను గొంత తలదాఁచుకొని సంతోషించెదము.

సత్య—ఓరాజేంద్రా! ఈమాలపడుచు లిప్పుడు కోరరాని కోరికలను గోరుచున్నారు. ఏమి చేయుదము?

గాల—మంత్రివైన నీకాలోచన తోఁపనిపక్షమున వీరిని నాకప్పగింపుము. చెఱినాలుగు లెంపకాయలు బహుమాన మిప్పించి, వీరు ముం దెవ్వరి నిట్టికోరకలు కోరకుండఁ జక్కచేసి సాగనంపెదను. వీరికి బాహ్యతాప మడఁగవలెనఁట! నేను జేసెడి యుపచారముచేత బాష్పవర్షము కురిసి యున్నితాపములును దీఱును. అయ్యో! నేను వీరిని దాఁకఁగూడని బ్రాహ్మణుఁడ నయిపోతినిగాని, కాకపోయినయెడల వీ రీపాటి యిల్లాండ్రకేశఖండనమహోత్సవము నాటి రాగములు తీయుచుఁ బరుగెత్తి యిల్లు త్రొక్కి చూడరా?

హరి—ఓయి వెఱ్ఱిబ్రాహ్మణుఁడా! తప్పుచేసినప్పటికిని స్త్రీల యెడలఁ గోపముచూపరాదుసుమా. నీ వూరకుండుము. నేను క్షమించి

మాటలతో వీరిని సమాధానపఱిచి సంతోషపెట్టి పంపివేసెదను. (అని మాలెతలవంకఁ దిరిగి) ఓకాంతలారా! మీరజ్ఞానముచేత నడుగరాని వస్తువడుగుచున్నారు. యాచకులెప్పుడును రాజులను ఛత్రచామరము లడుగరాదు. ఇయ్యఁదగిన మఱి యేవస్తువునయిన వేఁడుఁ డిప్పించెదను.

మాలె—అట్లయిన మేము మఱియొక వస్తువునే వేఁడెదము లెండి. ఈపయితాపమును మే మేశీతలవస్తువులచేత నయినను బాపుఁకోగలము. అడఁచుకొన్నను నడఁగక 'పయికిఁ' బొంగివచ్చెడి మాయంతస్తాపమును నీదయారసవృష్టిచేతఁ గాక మఱియెట్లు వారించుకోనేర్తుము? నిన్నుఁ జూచినప్పటి నుండియు మాహృదయములలో బెరుఁగుచున్న దురాపమయిన మన్మథతాపము పోవునట్లుగా మాకొక్కసారి నీచల్లని కౌఁగిలిదయచేయుము.

హరి—హరిహరా! (అని చెవులుమూసికొని) పాపము శమించునుగాక! ఔరా! ఏమి వీరి కండకావరము! ఈచండాలాంగనలు యౌవనమదముచేతఁ గన్నుగానక కండక్రొవ్వున నోర నుడువరాని పాపపుఁ గోరికలను గోరుచున్నారు. వీరసలే పరకాంతలు. ఆమీఁద మట్టను ముచ్చటింపను గూడని చండాలాంగనలు నా మనస్సు స్వప్నమందయినఁ బరసుందరులమీఁదికిఁ బోవునా? ఇఁక వీరితో మాటలాడినదోషమువచ్చును. పాకము మఱింత ముదురకమునుపే వీరినిక్కడనుండి సాగనంపింపవలయును. ఓసత్యకీర్తి! ఉచితానుచితపరిజ్ఞానము లేక తప్పఁద్రాగి నోరికి వచ్చినట్లు కారులు పేలుచున్న యీమదవతులను మనభటులచేత మాయెదుటనుండి సాగఁదోలింపుము.

సత్య—దేవరవారి సెలవుప్రకారము చేసెదను. ఓభద్రా! ఓపాలకా! మీరిద్దఱు నూరక చూచున్నారేమి? సురాపానవికార

ముచేత శరీరములు మఱచి యున్మత్తప్రలాపములు చేయుచున్న యీ తుచ్ఛక్రాంతలను దక్షిణమూవలికి గెంటి వేయుఁడు.

పాల—మేమును దేవరవారి యాజ్ఞకొఱకే యెదురు చూచుచున్నాము. ఓ చండాలులారా! గుండెబెదరులేక రాజుగారి నిట్టి దుండగపుఁగోరికలు కోర మీ కెట్లు నోరువచ్చినది? ఇఁక మీరిక్కడ నోరెత్తినపక్షమున నేనీ కత్తితో మీ నాలుకలు కోసెదను. లేచిపొండి.

(అని కొట్టుచున్నాఁడు.)

భద్రు—సంకోచము లేక వెఱ్ఱిపోకలు పోవుచున్న యీనీచురాండ్రమదము నేనడఁచెదను. (అని కొట్టుచున్నాఁడు.)

చంద్ర—ఓసత్యకీర్తి! ఈయబలలవీపులమీఁదబడిన దెబ్బలు నాహృదయము మీఁదఁ బడినట్లు తాఁకి నామనస్సు నొప్పించుచున్నవి. ఈబాధ నేను సహింపలేను. భటులను వెంటనే వారించి యజ్ఞానముచేత ననరానిమాట లన్న యీ కన్నియలను గొట్టకుండఁ జేయుము.

హరి—ఓమంత్రివరా! దిక్కుమాలిన యీయాఁడువారిని జేయిచేసికొని నొప్పించుట నేను జూడలేను. నేనువీరిని దృష్టిపథము నుండి తొలగింపు మంటినే కాని యిట్లు దయమాలి చబుకులపాలు చేయుమనలేదే. సమయమువచ్చినప్పుడు శత్రురాజులమీఁద మన ప్రతాపముఁ జూపవలెనుగాని యిట్టి యబలలమీఁదనా చూపుట? ఎదిరింపఁజేతకాని మానవతులను మొత్తుటలో నీవీరభటుల కేమి పౌరుషమున్నది?

ఉ. అర్థులమీఁదఁ జూపనగునా? తనశూరత వీరుఁ డెందుఁ బ్ర
   త్యర్థులమీఁద యుద్ధసమయంబునఁ జూపఁగఁ జెల్లుగాక! సం
   వర్ధితదీర్ఘవృక్షములపైఁ దనశక్తి మహాబలుండు తా
   నర్ధిని జూపుఁగాక యడుగంటినతీఁగెలమీఁదఁ జూపునే?

మ. అలుగం గాంతల యూరుయుగ్మములు మత్తారిభ హస్తంబులే?
లలనాపాంగనిరీక్షణంబు లరిరాడ్జాతోగ్ర బాణంబులే?
తిలకింప న్వీరిబోండ్లకన్బొమలు శత్రుత్స్నాపచాపంబులే?
వల దీక్రొవ్వీరిబోండ్ల నంట; నిపు డీబంట్ల న్నివారింపుమా.

సత్య—ఓవీరభటులారా! వీరి నావలకు గెంటుఁడని నేను నియోగింపఁగా మీరు మీశూరత్వమంతయు నీయాఁడువారిమీఁదనే కనఁబఱుచుచున్నారేమి? ప్రభువువారు కోపపడుచున్నారు. వీరిని గొట్టక విడువుఁడు.

పాల—ఓమంత్రిపుంగవా! రాజుగారిమనస్సు కలఁగియుండుట చేత వారికాగ్రహము తెప్పించి చిత్తమును జింతనుండి మరలింప వలయునని యిట్లు చేసినారమే కాని యాఁడువారిని జేయిచేసికొని కొట్టుటకు హరిశ్చంద్రునిబంట్లమయిన మేముమాత్ర మంతక్రూర చిత్తులమా?

మాతె—(ఏడ్చుచు) ఓరాజధమా! నీవాఁడుతోడునఁ బుట్ట లేదా? కిరాతుఁడవా? యాచింపవచ్చిన మావంటిపువ్వుకోమలులను గొట్టుఁడని యీయమకింకరులవంటి క్రూరులను గరుణమాలి నియోగింప నీకు నోరెట్లు వచ్చినది? మామెత్తని దేహములు దెబ్బలచేత నెట్లు కందినవో చూడు. మాకొప్పులు వీడి యీనేలమీఁద, పువ్వులెట్లు చిందినవో చూడు. ఓదయావిహీనా! ఇప్పుడయిన నీకన్నులు చల్లపడినవా? ఆఁడువా రుసురుసురని క్షోభపడినఁ దత్ఫలము కట్టి కుడుపక యూరకపోదు. మమ్ము బిడ్డలవలె జూచుకొనుచున్న విశ్వామిత్రునికి నీదుర్ణయమును నివేదించి నిన్నేమిచేయించెదమో చూడు. ఇంకొక్కనిమిష మోపికపెట్టుము. (అని వెడలిపోవుచున్నారు)

హరి—ఓసత్యకీర్తీ!

ఉ. కొప్పులువీడ, మోములనుగ్రొంజెమ రెంతయుఁగూడ, బాష్పముల్
కప్పలు గూరి యూరి కనుఁగొల్కుల జాలుగ నోడ, నయ్యెడ
లొప్ప తొలంగివాడ గపు నొక్కట నల్లల నాడఁ జేడెలా
చొప్పునఁ జూడు పోయెదరు శోకము రూపము తాల్చినట్లుగన్.

నిష్కారణముగా స్త్రీలను గొట్టించి మనము పాపమునకొడి గట్టుకొన్నాము. ఇట్లాడువారి నేడిపించిన క్షోభము మనకుఁదగులక పోదు. వారు విశ్వామిత్రునిగూడ జేర్కొనుచున్నారు. నాకిదియంతయు నేదో కపటనాటకముగాఁ గనఁబడుచున్నది. కాని సత్యము వలె లేదు. ఋష్యాశ్రమములెక్కడ? చండాల స్త్రీలుండుటెక్కడ?

సత్య—దేవరవారూహించినది యథార్థము. తపోవనముల యం దెక్కడను మాతంగాంగన లుందురని యీవఱకెన్నఁడును విని యుండలేదు. నాకుఁ జూడఁగా వీరేదో కపటము మనస్సులో నుంచుకొని యీప్రకారముగా వేషములు వేసికొని వచ్చినట్లుగాఁ దోఁచుచున్నారుకాని నిక్కంపుమాలెతలుగాఁ దోఁచరు.

చంద్ర—ఇదియేమో నాకును మహేంద్రజాలముగానే యున్నది. మనము భూతభూమికి వచ్చియుండలేదుగదా? లేక విశ్వామిత్రుని మాయయై యుండునా? తాళుఁడు మేఘగర్జనమువలె దూరమున నెవ్వరిదో గంభీరఘోషణము వినవచ్చుచున్నది.

హరి—(ఆలకించి) మాలెతలమాటలు విని దురాగ్రహము చేత మండిపడుచు మనమీఁదికి వచ్చుచున్న విశ్వామిత్రుని కోపవాక్యమువలెనున్నది వినుండి.

అందఱు—(చెవిలొగ్గి వినుచున్నారు)

(తెరలో)

శా. ఏమేమీ! తనబంట్లచేత మిము రాజరీతి మొత్తించెంగా!
యామూఢుండు తపఃప్రభావఘను నావంతేనియు న్నన్నువి

శ్వామిత్రుం డెలియం డీతం డెలియు నస్మచ్ఛండకోపాగ్నిచే;
భీమోద్యత్ప్రళయాగ్నిమీఁద శలభంబేమాఁక నుంకించెనే? 20

సత్య—అవు నతఁడు విశ్వామిత్రుఁడే. మాలెతలుపోయి నేరములు చెప్పి యాతనిని దీసికొనివచ్చుచున్నారు. ఓరాజేంద్రా! మీరు ధైర్యము వహింపవలసిన సమయమిది. దూరభీరుతయు నాసన్నధీరతయు మహాత్ములకు సహజగుణములు.

చంద్ర—ఓప్రాణనాథా! గాధేయుఁ డెట్లుకోపప్రకంపమానుఁడయి మనదిక్కునకు వచ్చుచున్నాడో చూచితిరా ? మీరించుకయు సంచలింపఁగూడదు.

హరి—ఓసత్యకీర్తీ! ఆవంకం జూడుము.

మ. కనుల న్నిప్పులు రాల నద్దెసలు రూక్షప్రౌఢి నీక్షించుచున్
ఘనదండాగ్రముతోడఁ బల్మఱును వీఁక న్నేల తాటించుచున్
వనదంష్ట్రిక్రియఁ బండ్లు దీటుచు జటాభారంబు తూఁగాడ గ్ర
క్కువ నేతెంచెడుఁ జూడు మాతఁ డదిగోఁ గోపంబు రూపొందె
నాఁ 21

అతఁడు మనమీఁదఁ గోపము చూపకమునుపే మనమిప్పు డెదురుగాఁ బోయి భక్తిఁజూపి శాంతచిత్తునిఁ జేయుదము. దుర్వారమయిన కోపాగ్నిని శాంతిజలముచేతనే యార్పవలయును.

చంద్ర—సలసలఁగాఁగుచున్న చమురులోఁబోసిన చల్లని నీరువలెనే మనశాంతవచనములు కోపపరవశుఁడయి యున్న యీ తాపసుని మఱింత మండఁజేయునేమో! అయినను మనము శాంతత విడువరాదు. శాంతాత్ములయెడఁ గోపముచూపి యాతఁడే దుష్టుఁడు కానిండు. మన మెదురుగాఁ బోయి పాదాక్రాంతుల మగుదము.

విశ్వా—(ప్రవేశించి పండ్లు పటపటకొఱుకుచుఁ గన్నులెఱ్ఱజేసి) నీతండ్రినిమిత్త మెంతో కష్టపడి నాతపస్సు ధారపోసి

క్రొత్తగా స్వర్గమును నిర్మించి నీజనకునికి బొందితో స్వర్గ మిప్పించిన మేలునైనఁ దలఁపక యిప్పు డెంతపని చేసితివి రా? ఓరికృతఘ్నుఁడా! (అని చేతిలోని యక్షమాలను గ్రిందఁబడవైచి కాలు నేలఁ దఱచు చున్నాడు)

హరి—(ఎదురుగాఁబోయి పయిబట్ట మొలకుఁజుట్టుకొని సాష్టాంగపడి) ఓమునిసార్వభౌమా! నమస్కారము.

విశ్వా—(తల కాలితో తన్ని) ఓరిపాపీ! ఈవఱకుఁ జేసినది చాలక యిప్పుడు నీశిరస్సు మోపి నాపాదములనుగూడ నంటుచేయు చున్నా వేమిరా? తొందరపడకు. నీవుచేసిన పాపఫల మిప్పుడే యనుభ వించెదవు.

హరి—స్వామీ ! దేవరవా రింతయాగ్రహముచేయుటకు దాసునియెడ నేమితప్పువచ్చినది? నవరత్నఖచితమయిన యీకఠిన కాంచనకిరీటము సోఁకి దేవరవారి మృదుపాదము నొచ్చినదేమో యని చింతిల్లుచున్నాను.

విశ్వా—ఓరిద్రోహీ ! ఇప్పు డొక్కపాదముమాత్రమే కాదు నీదుశ్చరిత్రముచేత నాసర్వాంగములును నొచ్చుచున్నవి. నీవు మా యాశ్రమమృగమును నొప్పించితివన్న దుఃఖముతోనే కోపాగ్నిరగుల నీకిదిబుద్ధి కాదని చెప్పవచ్చుచుండఁగా నింతలో గోలుగోలున నేడ్చుచు దారిలో పీరెదురుపడి గోరుచుట్టుమీఁద రోకలిపోటు వేసినట్లు తమ్మునొట్టించితివన్న పిడుగువంటి దుర్వార్తను నాచెవుల వేసి రాఁజు చున్న నాకోపాగ్నిని భగ్గునమండఁ జేసినారు. ఆశ్రమమృగముల హింసించు దుర్బుద్ధి నీ కేలపుట్టినది? ఇట్లునోరులేని సాధుజంతువులను తపోవనములుదూఱి సంహరింపుమని నీకునీగురుఁడుప దేశించినాఁడా?

ఉ. రాజులు మున్ను వేఁటలకు రారె? మదించినదుష్టజంతులన్
దేశముచూపి కానలను దీవ్రశరంబుల రూపు మాపరే?

యాజననాథు లేయెడల నాశ్రమభూములు చొచ్చినీవలెఁ
నైజమదోద్ధతిన్ మునివనంబుల సాధుమృగాళిఁ గూల్చిరే?

హరి—ఓ తాపసోత్తమా! ఈవిషయమున నే నేపాపము నెఱుఁగను. బాల్యచాపలముచేత వీఁడాడుకొనుటకయి నన్నా లేడిని బట్టియిమ్మని వేఁడఁగా సామాన్యకురంగ మనుకొని తఱిమితినే కాని నేనప్పుడది యాశ్రమమృగ మని యెఱుఁగను. ఎఱుఁగక చేసిన యీయపరాధమును క్షమింపుఁడు.

విశ్వా—మృగమును గొట్టుట యున్న నెఱుఁగక చేసితి నని బొంకితివి. వేఁడవచ్చిన యీనిరపరాధిను లయినకన్నియలను గొట్టించిన యపరాధము నేమని బొంకెదవురా? నీకీచక్రవర్తిత్వమువచ్చుట యడవులలోఁ గందమూలాదుల నేఱుకొని తిని బ్రదుకు మావంటి సాధులను బాధించుకొఱకా? శిరీషపుష్పకోమలు లయినయీముద్దరాండ్రను కఱకుకశలతో మోఁదు మన నీకు నోరెట్లువచ్చెను.

హరి—ఓమునీంద్రా! ఇఁక మాటలెందుకు? నేను జేసిన వన్నియు నపరాధములే నేనపరాధములు లక్ష చేసినను శరణంటిని గనుక నన్ను మన్నింపుఁడు. శరణన్నమాత్రమున శత్రునకైన నభయ మియ్యవలెను. తన్నునఱకవచ్చినవారికిఁగూడ వృక్షమునీడనియ్యదా? ఓదయామయా! శాంతింపుము, శాంతింపుము.

విశ్వా—శాంతిపరు లయినయాఋషులు వేరు; మేము వేరు. మమ్ము వారివలెఁ దలంపకుము. నీవు చంకదుడ్డును శరణార్థియు ననుచున్నావు. నీ విఁక లక్ష చెప్పినను నీమీఁద మాకు దయరాదు. నాదుర్వారకోపాగ్నికి నిన్నిప్పుడు మిడుతనుజేసెదఁజూడు.

గాల—ఓబీదతాపసీ! మారాజు వెఱ్ఱివాఁడయి బతిమాలుకొన్న కొలఁదిని నీవంతకంతకు బిఱ్ఱబిగిసి మిఱ్ఱెక్కుచున్నావు. దయా

లేశము లేని ఈ నీ తప మెందుకు? జప మెందుకు? దమ మెందుకు? స్వాధ్యాయ మెందుకు? కాల్పనా.

చ. అరయఁగ నంతరాత్మను దురాగ్రహపాపమునుండి పాపి సు
స్థిరమతి నిష్కళంకముగఁ జేసినఁ గాక, జపంబు వల్కలాం
బరములు, మౌనమున్, జడలు, వహ్నులుఁ, గృష్ణమృగాజినంబులున్
బురుషుఁ దపస్వి చేయునె? సమూలము వమ్ముగుఁ గాక యన్నియున్.

సత్య—ఓగాలవా! పెద్దల నట్లనరా దూరకుండుము. ఋషులు మాటలలోఁ గాకను జూపినను గ్రియలలోఁ జల్లదనమునే కనఁబఱుతురు. వీరి పలుకులు వజ్రకఠినము లయినను హృదయములు నవనీతకోమలములు.

గీ. కఠినముఁగ ముందు కోపవాక్యంబు లన్న
ఋషులు మేలునె చేయుదురు రెండుఁ బిదప;
మొదల మేఘంబు లుఱిమినఁ బిదప నవియె
వానకురిపించు గాదె యీవసుధమీఁద. 24

విశ్వా—ఓరీ! విప్రాధమా! మమ్ము దయయెఱుఁగని క్రూరులమని చెప్పసాహసించుచున్నావుగా! మాకోపమునకు బ్రహ్మరుద్రాదులయినను దలంకుచుండఁగా నీవెంతనిర్భయముగా మమ్ము నిరాకరించుచున్నావురా? మాక్రోధవహ్నిని నీవును జవిమాతువు గాని నిమిషము తాళుము.

గాల—క్రౌర్యము మీవంటి మునివ్యాఘ్రములు చూపినప్పటివలె వ్యాఘ్రములు చూపినప్పుడంత బాధాకరముగా నుండదు. వేఁడుకొన్నను నిరపరాధులమీఁద దయరాదేని, నిర్దయుఁ డయిన యామనుష్యుఁడు కేవల క్రూరమృగమే. కాదు, కాదు. క్రూరమృగమే వానికంటెను సహస్రగుణములు శ్రేష్ఠమయినది. నీ బైద

రింపులకు జడియుటకు నేనడవిలో ముక్కుమూసుకొని కూరుచుండెడు వశిష్ఠుఁడనుగాను. నన్నెవ్వనిగా భావించుచున్నావు? నీకంటెను బదిరెట్లెక్కువ నేర్చిన యాస్థాన పరిహాసకుఁడను జుమా నేను.

హరి—మునిచంద్రా! తాను బరిహాసకుఁడనని యీబ్రాహ్మణుఁడే చెప్పుకొనుచున్నాఁడు. అట్టి పరిహాసకు నవ్వులాటమాటలను మీరుపాటిగాఁబట్టి రోషము చూపఁదగదు. కాలకూటవిషాగ్నినిమించెడు మీకోపానలమునకు బ్రహ్మేంద్రాదులును దాళఁజాలరన, మేమేపాటివారము? మీవంటిఘనులు పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రము వేయుదురా? కొడుకు లెప్పుడయిన బుద్ధిలేక తప్పుచేసినచో, తండ్రి శిక్షచేసి రక్షింపఁడా? ఇఁక మీకు దయవచ్చునందాఁక మీ పాదములనుండి లేవను. నన్ను నీటముంచినను పాలముంచినను దేవరదే భారము. (అని మరల పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

చంద్ర—ఓమహాత్మా! మారక్షణభారము మీది. ఈతప్పు బుద్ధిపూర్వకమైనది కాదు. ఎఱుఁగక చేసినతప్పును మీవంటిసత్వగుణప్రధానులయిన మునిసత్తములే క్షమింపకపోయినయెడల మఱి యెవ్వరు క్షమింతురు?

విశ్వా—(శాంతతతో) ఓరాజేంద్రా! పాదములమీఁదనుండి లెమ్ము. ఋషులకెప్పుడును దీర్ఘరోషము గూడదు. నీవిప్పుడు పశ్చాత్తాపముగలవాఁడవయి భార్యాపుత్రులతో మాపాదములమీఁదఁ బడి యింతగాఁ బ్రార్థించుచున్నావు గాన నీదీనత్వమును జూచి కరుణించి నీయపరాధముల నన్నిటిని మఱచిపోవుచున్నాము. నీకు మాయెడల నిజమైనభక్తి యున్నయెడల, నీవుచేసిన యపరాధమునకుఁ బ్రాయశ్చిత్తముగా మాకూఁతులైన యీమాలెతలను వరించి మాకు మనఃప్రీతి చేయుము. నిన్నిప్పుడు క్షమించెదము.

హరి—(చేతులు జోడించి నిలిచి) సర్వధర్మవిధులయిన దేవర వారికి నేను ధర్మములు చెప్పనంతటివాఁడను గాను. ధర్మతత్త్వము లన్నియు మీకుఁ గరతలామలకములయి యుండును. లోకములో మీరెఱుఁగనిధర్మములు లేవు. అట్టి సకలధర్మవేత్తలయిన మీరే ధర్మవిరుద్ధమయిన యీపని చేయుమని నియోగించుట యర్హమగునా నామనసుకనిపెట్టవలెనని మీరిట్లానతిచ్చి యుందురు. కానివర్ణాశ్రమ ధర్మపరిపాలన పరులయిన తమరిటు మనఃపూర్తిగాఁ బనిచియుండరు.

విశ్వా—ఏమి? నీవేమాకిప్పుడు ధర్మోపదేష్టవుగా, గనఁబడు తున్నావు! నీకుమాకంటెను ధర్మము లెక్కువ తెలియునుగా? నీవు సుఖపడఁగోరుదువేని, అన్యచింతమాని వీరిని వరింపుము. మామాట దాటక వీరి నిప్పుడు చేపట్టితివా, నీతండ్రికివలెనే నీకును బొందితోనే స్వర్గలోకసుఖమును గలిగించెదము.

హరి—ఓమునివర్యా! ధర్మబాహ్యమయిన కార్యమును గురువు విధించినను జేయఁగూడదని మీవంటిపెద్దలు చెప్పుదురు. ఇఁక నామనోనిశ్చయమును వినుఁడు, కులధర్మమును మీఱి పొందు స్వర్గసుఖముకంటెను ధర్మమార్గము నవలంబించుట చేత లభించెడు నరకదుఃఖమయినను నాకుఁ బరమప్రియము. నాకున్న రాజ్యమును సర్వసంపదలను విడువుమన్నను విడుతునుగాని ధర్మముమాత్రము నేనెన్నఁడును విడువఁగలవాఁడను గాను. మీరిఁక నన్నేమి చేసినను జేయుఁడు. ఇవిగో నాయర్థమును దేహమును మీయధీనములు.

విశ్వా—నీప్రతిజ్ఞకు మేము సంతసించినారము. నీవు సత్యసరస్వతివి. నీవిప్పుడన్నమాట తప్పఁగూడదు. ఏవీ నీరాజ్యమును ధనమును సర్వమును మాకు ధారపోయుము. మేమింతటితోఁ దృప్తి పొంది యాశ్రమమునకుఁ బోయి రాజ్యసుఖమునయిన ననుభవింపుచుండెదము.

హరి—(చంద్రమతివంకఁజూచుచున్నాఁడు.)

చంద్ర—ఓప్రాణేశ్వరా! మీరనుమానింపక వెంటనే మీ రాజ్యమునుమిగిలిన సర్వస్వమును యాచకోత్తముఁడయిన యీముని సత్తమునకు ధారాదత్తము చేయుఁడు. మీధర్మపత్నినయి యుండి నేనుమాత్రము మీసత్యమునకు ధర్మమునకును భంగము గలిగింతునా?

హరి—ఓమునిచంద్రా! ఈభూమి మొన్నమొన్నటిదాఁక మీ కేలినిస్సారమని విడిచిపెట్టిన దేకాని క్రొత్తదికాదు. దీనినిమరల ననుభవింపవలెనని మీకుఁ గోరికపుట్టినయెడల మీరాజ్యమును మీరు మరల గ్రహించి నన్నుఁగృతార్థుని జేయుఁడు.

విశ్వా—నీ చమత్కారవాక్యము లింతటితోఁజాలును. ఈ తేనెమాటలకు మోసపోవువా రిం దెవ్వరును లేరు. ఇఁక జాగు చేయక ముందుగా నీసర్వసామ్రాజ్యమును మాకు ధారపోసి తరువాత మఱి మాటాడుము.

హరి—పాత్రదానము చేత నేను ధన్యుఁడనగుచున్నాను. ఇదిగో స్వీకరింపుఁడు. గాలవా! ఆజలకలశ మిటు తెమ్ము.

గాల—(ఇచ్చుచున్నాఁడు)

హరి—(పుచ్చుకొని) అస్మత్సకలసామ్రాజ్య ధనకనకవస్తు వాహనాని శ్రీపరమేశ్వరప్రీత్యర్థం ధారాపూర్వకం బ్రాహ్మణాయ తుభ్య మహం సంప్రదదే నమమ. (అని చేతిలో ధారపోయుచున్నాఁడు)

విశ్వా—(గ్రహించి) ఓరాజేంద్రా! నే నిప్పుడు కొంతవఱకు సంతుష్టాంతరంగుఁడయినాను. మీశరీరములయందున్న యీయాభరణములుకూడ నీవు మాకిప్పు డిచ్చిన సర్వస్వములోనివే గనుక నీ యలంకారములును నీభార్యాపుత్రుల యలంకారములునుగూడ నిప్పించి మమ్ము సంపూర్ణసంతోషులఁ జేయుము.

హరి—నేను ధన్యుఁడ నగుచున్నాను. ఇవిగోఁ బుచ్చుకొనుడు. (అని తీసియిచ్చుచున్నాఁడు)

చంద్ర & లోహి—(తమనగ లిచ్చుచున్నారు)

విశ్వా—(పుచ్చుకొని) ఇది యంతయు సరేకాని మేమయోధ్యకుఁ బోయిన తరువాత నీమంత్రులు మొదలయినవారు మమ్ముఁ జేరనీక తఱిమి రాజ్యమియ్యకపోయిన యెడల, మేమేమి చేయఁగలము? నీ విప్పుడు మాతోఁగూడ స్వయముగా వచ్చి రాజ్యము మాకిప్పించి తరువాత నీయిచ్చవచ్చినచోటికిఁ బొమ్ము.

హరి—స్వామీ! అంతకంటెను నాకుఁ గార్యమేమున్నది? మీచిత్తమువచ్చినట్లు చేసెదను. పట్టణమునకుఁ బోవుదము విజయం చేయుఁడు. (అందఱు నిష్క్రమించుచున్నారు)

తృతీయాంకము

రంగము—అరణ్యమార్గము

[చంద్రమతీ లోహితాస్య సహితముగా హరిశ్చంద్రుఁడును, జనమిత్రుఁడు కామపాలుఁడు మొదలయిన పౌరులును ప్రవేశించుచున్నారు]

హరి—ఓపౌరజనులారా! ఈయరణ్యమార్గములయం దింకను మీరెంతదూరము నాతోవచ్చెదరు? నాప్రార్థన విని మీరిక్కడ నుండి మరలుఁడు.

జన—(కన్నుల నీరు పెట్టుకొనుచు) ఓ మహారాజా! చిన్ననాఁడు కన్న తల్లిదండ్రులను మఱచిపోయి తల్లియుఁ దండ్రియు జట్టి

ములును సమస్తమును మాకు నీవే యనుకొని, కలలోను గష్టములన్నమాట యెఱుఁగక చిరకాలమునుండి మేము తల్లిచాటుబిడ్డలవలె మీపాలఁబడి సుఖంపుచున్నాము, అట్టిమే మిప్పు డెట్లు మిమ్ము విడిచి మరలి పోగలము? మేమును మీపాదసేవ చేయుచు మీవెంటనే వచ్చెదము.

కాశ—ఓసార్వభౌమా! అనాథులమయిన మమ్మెవ్వరికొప్పగించిపోయెదవు?

చ. తడవుగఁ జిల్కలం బెనిచి దారుణలీలను గండు బిల్లికిన్
గడపట నప్పగించి చనుకైవడి, మమ్మిటు లింత కాలమున్
గొడుకులకన్న నెక్కుడుగఁ గూరిమి నారసి మీరిప్పుడీ
చెడుముని వాతఁ ద్రోచినఁ జెల్లునె నిర్దయవృత్తి నక్కటా!

చ. నిలువఁగ నీడయున్ గుడువనిచ్చలుఁ దియ్యనిపండ్లనిచ్చి, గా
డ్పులకును నెండవానలకుఁ బ్రోపయి ప్రాపయియున్న వృక్షమున్
దొలఁగినిమేషమేని ధృతిదూలక పక్షులు నిల్వఁ జాలునే?
పలుకు లిఁకేల? దిక్కఱిన పక్షులమే యయినార మియ్యెడన్.

ఇన్ని నాళ్ళును గష్టపాటన్న నెట్టిదో యెఱుఁగక మీచాటున బ్రతుకుచున్న గంగిగోవులవంటి మమ్మీ మదరాగ్రహశీలుఁ డయిన మునిశార్దూలునిపాల విడిచిపోవ మామీఁద మీకింతకరుణయేల లేకపోవలెను?

హరి—ఓపౌరజనులారా! మిమ్ము నేనుదయలేక విడుచుచున్నానని మీరెప్పుడును స్వప్నమందును జింతింపఁబోకుఁడు. ఈ విశ్వామిత్రుఁడు తపోధనులలో నెల్లను బరమపవిత్రుఁడు; విశుద్ధచరిత్రుఁడు. ఈమునిసత్తముని మహత్వ మెఱుఁగనివారగుటచే మీరీలాగునఁ దెలియనిమాటలు పలుకుచున్నారు. ఈతఁడు పూర్వము చిరకాలము సకలజనరంజకంబుగాఁ బ్రజాపాలనము చేసిన మహానుభావుఁడు. ఈయన

సత్పరిపాలనముచేత మీరును ముందత్యల్పకాలములోనే యనంత సౌఖ్యమననుభవింపుచు నన్నుమఱవఁగలరు. నిర్విచారముగా మీరు మీయిండ్లకుఁబొండు.

జన—అకారణముగా రాజ్యమంతయుఁబుచ్చుకొని, నగలప హరించి, కట్టుబట్టలతో నరణ్యములకు సాగనంపి, మీవంటిపరమ సాధువులకే యింతలేసియపకారములుచేసిన మహాత్ముఁడు మమ్ము మాత్రముసంరక్షించి మాకుపకారము చేయునన్న మే మెట్లునమ్మ గలము? గోహింసకు సంకోచింపని క్రూరవ్యాఘ్రము మేఁకలనుమేపి కాపాడునా! మాకీవట్టిభ్రమలు కల్పించి యడియాసలు పెట్టక మమ్ము మీ వెంటఁ గొనిపొండు.

కాశ—ఓ మహారాజా! సాధుబాధకు వెనుదీయని యీయన దయాగుణమును మావద్దఁ జెప్పఁబోకుము. మీధనకనక వస్తువాహనాదులకు క్రూరచిత్తుఁడయి కయికొన్న యీతనికి దయయెక్కడిది? సర్వసంగపరిత్యాగినని యడవులలోఁ దపస్సు చేసెడి యీతని కీ యిహలోకసంపద లేలకావలసి వచ్చెను?

చ. ఒనరుగృహాదిభోగములు యోగములే? ప్రతివృత్తి క్రేల్ప నిం
ధనములె యాధనంబులు? రణన్మణిభూషలు వేదఘోషలే?
మొనసినపూవుఁదోఁటలు తపోవనవాటులె? రాజ్యమాజ్యమే?
మునికి నివేల భూవిభవముల్? వెత పెట్టఁగఁ గాక సాధులన్. 3

హరి—ఓపౌరులారా! పెద్దలను మీరట్లనఁగూడదు. మహాత్ముల చిత్తవృత్తులు మనవంటివారికి విదితములు కావు. మమ్ముఁ గృతార్థులను జేయఁదలఁచియే వారీధనకనకాదిసంపదలు స్వీకరించిరి కాని, ముముక్షువు లయిన తమకుఁగావలసి కాదు.

క. జనకులు నగ లిడఁ గొడుకుల
కును జెవుల న్నొప్పి యెత్తఁ గుట్టించుగతిన్

నను ధన్యునిఁ జేయునె యీ
ఘనుఁడును గష్టములు నాకుఁ గల్పించుఁ జూఁడీ. 4

ధనముపోయినప్పుడే పురుషుని యోగ్యతలు లోకములోఁ దెలియనగును. కాఁబట్టి నాధన మాతఁడు గ్రహించుట నామేలుకొఱకే. ఇఁకముందు నేను మీకందఱకును నాస్వచ్ఛగుణముతో నగపడుదును.

చ. వినుఁడు ధనంబు భీరులను వీరులఁ గాఁగను దోఁపఁ జేసెడున్;
ఘనతరబుద్ధిమంతులఁగఁ గన్పడఁ జేయును బుద్ధిహీనులన్;
బనుపడఁ దోఁపఁ జేయు గుణవంతులఁగా గుణహీనులన్; సదా
జనులను మోసపుచ్చి ధనసంపద చిత్తము మత్తుఁగొల్పెడున్. 5

ఇట్లు మోసము చేయని దొక్కబీదతనమే.

చ. కనకము శుద్ధ మాటయును గల్మషదూషిత మాట తిన్నఁగా
ననలముచేతనే యెఱుఁగ నయ్యెడుకైవడి, భూమిలోపలన్
జనుఁడు విశుద్ధుఁ డౌటయు నిజంబుగఁ దాఁ గలుషాత్ముఁ డౌటయున్
వినికిడి చేయు స్పష్టముగ బీదతనంబె జగజ్జనాళికిన్. 6

జన — దేవరవారు సెలవిచ్చినట్లు పేదవారిని మంచివారినిగఁ జేయలేకపోయినను మంచివారినిసహితము చెడ్డవారినిగాఁదోఁపించెడి దుర్గుణ మొకటి బీదతనమునందుఁగూడ నున్నది. కాఁబట్టి బీదతన మెప్పుడును మంచిదనరాదు.

చ. సిరులు తొలంగినన్ సఖులు చేరరు; చేరవ రారు బంధువుల్;
కరముఁ దిరస్కరించుఁ గులకాంతయు; లోకులు సద్గుణంబులన్
సొరిదిని దుర్గుణంబులుగఁ జూతురు; పేదరికంబుకంటెఁ దా
మరణమె శ్రేయ మంచుఁ బలుమాఱును నేమదిలోఁదలంచెదన్. 7

క. జీవించినంత కాలముఁ
దా వేదనలన్ ఘటించు దారిద్ర్యమిలన్;
చా వన్న నొక్కనిమిషమె
యా వేళను బాధ పెట్టు నవనీజనులన్. 8

హరి—నీవన్నమాట కొంతవఱకు సత్యమే కాని పామరజనులవలన గౌరవము పోవు నని బీదతనము వచ్చినంతమాత్రముచేత నెవ్వరును సిగ్గు పడవలసిన పని లేదు. లోకములో ధనికుఁ డన్న స్థిరమయిననీతిసంపద గలవాఁడే కాని చంచల మయిన కాంచనసంపద యున్నవాఁడు కాఁడు. బీదవానియొద్దనున్నను ధనికునియొద్దనున్నను నీతి యెప్పుడును నీతియే. దానిగౌరవముదానిదే.

ఉ. నీతికి హేమభూషణమణిప్రకరంబుల వన్నె రాదిలన్;
నీతికి వన్నె పోదు ధరణిన్ వెలమాలినచింపిగుడ్డలన్;
నీతికి గౌరవం బెపుడు నిల్చుఁ జుమీ సహజంబుగానె; వి
ఖ్యాతిగ నీతివర్తనము నందఱు మానక యుండఁగానలెన్. 9

ఈరీతిగా బీదతనము వచ్చినందుకు నేను లేశమును జింతపడనుగాని ఇఁక నతిథులును నభ్యాగతులును మునుపటివలె నావలన సత్కారమును గానక శూన్యమయిన నాగృహమును జూచి యుస్సురని పోవలసినవా రగుదురుగదా యని మాత్రము విచారపడుచున్నాను.

జన—ద్యూతాదులచేతఁ గాక యోగ్యదానముచేత ధనము కోలుపోయిన మీరంతగాఁ జింతిల్లవలసిన పని లేదు.

క. సరి లేని దానమహిమన్
సిరులం బోఁగొట్టుకొన్న శ్రీమంతుఁడొగిన్
ధరలోన సానఁ బట్టిన
వరరత్నముఁ బోలి మిగుల వన్నెకు నెక్కున్. 10

అయినను దారిద్ర్యము మిక్కిలి దుస్సహమయినదే. అందులోను గష్టపడి సుఖపడవచ్చునుగాని సుఖపడి కష్టపడుట మిక్కిలి దుర్భరము. కటకటా! మహారాజపదవినుండి నిరుపేదతనము నొంది మీరీకష్టముల నెట్లు సహింపఁగలుగుదురు? ఋషివేషముననున్న క్రూరచిత్తుఁ డయిన యాకిరాతుఁడు నిర్నిమిత్తముగా మీకిట్టిపాట్లు తెచ్చిపెట్టెనుగదా?

హరి—ఓజనమిత్రా! నీవు విశ్వామిత్రుని బరోక్షమున నిందింపఁ బోకుము. ఆమహర్షి యే యిప్పుడిక్కడఁ బ్రత్యక్షమయిన పక్షమున మీ గతి యేమి గావలసియుండును?

(తెరలో విశ్వామిత్రుఁడు)

ఉ. పోకుర పోకు మెచ్చుటికిఁ బోయెదు మమ్మిటు మోసపుచ్చి? నీ
వోకలుషాత్మ! నిల్వు మిట నొక్క నిమేషము; పోయినంత నే
నీకణువైన దక్కఁగను నేర్చునె బ్రాహ్మణవిత్తమోరి దో
షాకర! విప్రవిత్త మపహర్తలఁ జంపుఁ జుమీ విషాభమై. 11

జన—విశ్వామిత్రుఁడు రౌద్రాకారముతో నిక్కడకే వచ్చుచున్నాఁడు. నేనిప్పు డన్నమాట విని యుండఁడుగదా!

హరి—ఓపౌరులారా! విశ్వామిత్రునికంటఁబడకమును పే మీరు దాటిపొండు. మీ వ్యర్థప్రయత్నములు మాని యిల్లు చేరి సుఖంపుఁడు. పొండు.

జన—ఇకుములు గుడువుఁ డని విధి మానొసట వ్రాసిపెట్టగా, మే మెట్లు పోకుండఁగలము? అమ్మా! చంద్రమతీ? మేము పోయి వచ్చెదము. మమ్ము మరచిపోకుము. ఇన్నాళ్ళును మిమ్ము మాకన్న తల్లివలెఁ జూచుకొని మీ చల్లదనముచేత మీచాటును సుఖంచుచుంటిమి. దైవమోర్వలేక మాకిప్పుడా భాగ్యము లేకుండఁజేసినాఁడు. (అని యేడ్చుచుఁ బౌరులు పోవుచున్నారు.)

[అప్పుడు విశ్వామిత్రుఁడును శిష్యుఁడగు నక్షత్రకుఁడును బ్రవేశించుచున్నారు.]

విశ్వా-ఉ. పోకుర పోకు మెచ్చుటికిఁ బోయెదుమమ్మిటుమోసపుచ్చి?నీ
వోకలుషాత్మ!నిల్వుమిట నొక్కనిమేషము; పోయినంత నే
నీకణువైన దక్కఁగను నేర్చునెబ్రాహ్మణవిత్తమోరి దో
షాకర!విప్రవిత్త మపహర్తలఁ జంపుఁజుమీవిషాభమై 12

నేను మఱియెవ్వఁడను గాను! విశ్వామిత్రుఁడను జుమా! నాసొమ్ము నీకు దక్కినదనుకోకు.

హరి—ఓమునికులతిలకా! ఇదియేమి? నేను నాసామ్రాజ్యమును వస్తువాహనములును సమస్తమును మీకే సమర్పించి పట్టపగలు కట్టుబట్టలతో లేచివచ్చుచున్నను మీధన మపహరించినాఁడనని నా వెంటఁ బడుచున్నారు!

విశ్వా—ఏమీ! ధనరాజ్యమదాంధత! నాఁడు మాకు యజ్ఞార్థము ధనమిచ్చిన మాటకూడ నీవప్పుడే మఱచిపోయినావుగా! ఆధన మప్పుడు మేము నీయొద్దనే, యునిచిపోలేదా? మాధనమును మరల మాకప్పగింపక పాఱిపోవుట నీకు న్యాయమగునా? మేము పరాకుపడినను నీవు మాకు స్మరణకుఁ దేనక్కఱలేదా?

హరి—ఓమునిసార్వభౌమా! లేనిపోనియప్పు నామీఁదబెట్టి యన్యాయముగా నన్నిట్లు చిక్కులుపెట్టుట మీకు ధర్మముకాదు. మీయజ్ఞమునిమిత్తము నేనిచ్చెదనన్నసొమ్ము మీకింతకు మునుపప్పగించిన ధనములోనే యున్నది.

విశ్వా—ఏమిరా! నీకండక్రొవ్వు! నీవన్యాయమున కొడిగట్టి యెదురుకెదురు మేమే న్యాయము తప్పినవారమయినట్టు చెప్పుచున్నావు! నీవు మొన్న యరణ్యములో నీవద్దనున్న సర్వస్వమును నాకు దానమిచ్చి నప్పుడు దానవాక్యములో నే నప్పుడుదాచనిచ్చినధనము తక్కఁ దక్కినదానినిమాత్రమే యిచ్చినానని చెప్పినావా? ఈధనము నిమిత్తమయి నీ వేల బొంకులుపలికెదవు? ఇంతకన్న నాకు దానమే యియ్యలేదని చెప్పరాదా? నీవట్లు బొంకినపక్షమున నీవద్ద నేను దాఁచుకొన్నధనమంతయు విడిచిపెట్టుటయే కాక నేఁడు నీవద్దగైకొన్నరాజ్యమునుగూడ నీకిచ్చివేసి నే నీ గోచిపాతతో లేచిపోయెదను.

హరి—ఓమునీంద్రా! ఈరీతిగా విపరీతార్థకల్పనముచేసిన చో నే నేమియు మీయెదుట బదులు చెప్పఁజాలను. మీకుఁ బుచ్చుకొనుట న్యాయమని తోఁచినపక్షమున మీధనమునుమీకునాతలతాకట్టుపెట్టియైనను, నెలదినములలో సమర్పించెదను. అంతేకాని ప్రాణము పోయినను నాజిహ్వ యసత్యమెప్పుడును బలుకదు. నాతండ్రి సత్యవంతుడు; సత్యమే నా కతఁడు విడిచిపోయిన ముఖ్యదాయము. జంగమస్థావర రూపమయిన నాపితృధన మంతయుఁ దృణప్రాయముగా మీకు విడిచితినిగాని మీవంటివారు పదివేలువచ్చి యాచించినను పీడించినగూడ సత్యరూపమయిన యీపితృ ధనమును నేను విడువఁ గలవాడను గాను.

విశ్వా—మేమిన్ని మాటలవారముగాము, మాకు న్యాయముగా ధనమురావలసియే యున్నది. మేము శాంతిధనుల మయిన మునుల మగుటచేత నిన్ను నిర్బంధించి క్రౌర్యము చూపలేము. నీవు కోరినట్లు ముప్పది దినములును గడు విచ్చినారము. మా శిష్యులలో నెల్లను సదాచారుఁడయినయీమునికుమారుని మీవెంటఁ బంపుచున్నాము. మాధనము నీ వీతనిచేత నిచ్చి పంపివేయుము.

నక్ష—ఓగురువర్యా? నాబత్తెముమాట చెప్ప మఱచిపోయినారు.

విశ్వా—నేనుజెప్పనక్కరలేదు. ఉచితజ్ఞుఁడై నయీతఁడే నిన్నుసంతోషపెట్టును.

హరి—ఓమునిసార్వభౌమా! అనుగ్రహించి మమ్మింతటితో విడిచిపెట్టుము. మితిదినములలోపల మీ ధనమును మీకు సమర్పించుకో లేకపోయినయెడల మమ్ము విక్రయించియైన మీరుమీవిత్తము రాబట్టుకోవచ్చును.

విశ్వా—నీ వేది చెప్పినను దానికెల్లను మే మొప్పుకొను చున్నాము. ఈ బాలుఁడు నా ప్రియశిష్యుఁడు; ఈతని పేరు నక్షత్రకుఁడు. ఇతఁడు కొంచెము కోపస్వభావుఁడు. మీరు వీనిపరుషభాషణములకు రోషపడక కూడఁగట్టుకొని రావలెను. ఇతఁడు బహుసుకుమారుఁడు; ఎన్నఁడును మార్గాయాసమున కోర్చినవాఁడు కాఁడు. వేళపట్టున వీనికన్నపానాదు లిచ్చి వీనిని మీరెట్లాదరించెదరో! నేను బోయి వచ్చెదను. (అని విశ్వామిత్రుఁడు బోవుచున్నాఁడు.)

హరి—ఓ మునికుమారా! నీవు ముందు నడువుము. మన మిప్పుడు బయలు దేఱి యీ మార్గంబునఁ గాశికాపురమునకుఁ బోవుదము. ఓ ప్రాణేశ్వరీ! నా మూలమున నీ కెంత దురవస్థ తటస్థించినది! ఆగర్భశ్రీమంతురాల వయిన నీవిప్పు డీకటికి నేలను ముండ్లలోను నడువవలసిన దాన వయినావు గదా? (అందఱు నడుచుచున్నారు.)

చంద్ర—ఓ ప్రాణనాథా! నా నిమిత్తమై మీ రెంతమాత్రమును విచారింపఁబని లేదు. మీతో నుంటచే నాకిక్కడ సుఖముగా నేయున్నది. మహారాజ్యభోగ మనుభవించిన మీరిట్లు దివ్యభవనములు విడిచి మహారణ్యములలో సంచరించుచు నెట్లుకష్టపడఁగలరా యని మాత్రము నా మనస్సు ఖేదపడుచున్నది.

హరి—(కన్నీరు నించుచు) పరిచారికాశతములు సేవ చేయ, సదా యంతఃపురములయందుండి, ఎండకన్నును నెఱుఁగకుండెడి నీది కాని నా దేమికష్టము? నీవు నాతో నెక్కడనుందువో నాకదే దివ్యభవనము; నీవు లేనిచోటే నాకు మహారణ్యము.

చ. అనవరతంబు ప్రాణపద మైనపదార్థముఁ గూడి యుండినన్
వనమును మందిరం బగుఁ; విపత్తులు సారసుఖప్రదంబు లౌ
తనప్రియవస్తువున్ విడిచి దవ్వుగ నుండెడివాని కాప్తుఁబెక్
విను సుఖ మియ్యఁజాలదు భువిం దనప్రాణమె భారమౌఁ జుమీ.

అయ్యో! నీకష్టములకుఁ దోడు నాకష్టములనిమిత్తమయి కూడ దుఃఖపడుచున్నావుగదా!

సీ. పికనాదముల కింత భీతిల్లిపఱచెదు
    పులులయార్పుల కెట్లు నిలిచెదీవు?
విరిదోఁటలో నింత విహరింప వలసెదు
    నట్టడవుల నెట్లు నడచెదీవు?
శశికాంతములపైనె చరణముల్ కందును
    మొనరాళ్ళపై నెట్లు మోపెదీవు?
పసిఁడిమేడలమెట్లపయి నెక్కనోడెద
    విచటిమెట్టల నెట్టు లెక్కెదీవు?
గీ. అలరుదీఁగె యింత తోలఁకఁద్రోయఁగ లేవు
పాఱుపొదల నెట్లు దూఱెదీవు?
కేళిశుకముఁ దడవు కేలఁ దాల్పఁగ లేవు
కొడుకు నెటు వహించి నడతు వీవు? 14

కటకటా! ఈశ్వరునకును మనమీఁద దయ లేదు కాఁబోలును!

చంద్ర—ఈశ్వరునకు మనమీఁద దయయున్నదని మన సంరక్షణనిమిత్తము కత్తులును గటారులును దెచ్చి యిచ్చునా? మనయెడల నాతని కనుగ్రహ మున్నందుననే మన కాతఁడు నీతిపథమునుండి మరల మంచిబుద్ధిని దయచేసినాఁడు. ఆబుద్ధిని యెప్పుడును మన మాయుధముగా నుంచుకొని ప్రవర్తించితిమా రాళ్ళమీఁదఁ బరున్నను సుఖనిద్ర పొందుదుము. ఓప్రాణవల్లభా! ఇవి కష్టములని తలఁచి యేల చింతిల్లెదరు? ఈశ్వరుఁడు మనకు మనస్థైర్య మున్నదో లేదో పరిశీలించుటకయి యేర్పరచిన శోధనలే కాని యివి వేఱు కావు.

హరి—అవు నవును. నీవు చెప్పినది పరమసత్యము. ఆపదలు లేని సుఖదినములయందు మనుష్యుని యోగ్యతను దెలిసికొనుట కవకాశ ముండదు.

ఉ. ఆపద లొక్కటం దగులునప్పుడె ధీరుఁడు సుస్థిరుం డగున్;
కాపురుషుండు కష్టముల గాసిలి నిల్వక సంచలించెడుఁ
దాపునఁ దీవ్రమారుతము దందడి ముట్టిన, బెండు నిల్వగా
నోపక పాఱుచో నిలిచి యుండవె గ్రావఁకులు సుస్థిరంబులై? 15

నక్ష—మీరు మహాపండితులవలె ధర్మోపన్యాసములు చేయుచుఁ బెండ్లినడకలు నడుచుచున్నారు. నాకుఁ గ్రింద కాళ్ళు కాలుచున్నవి; పైని నెత్తిమాడుచున్నది. నేను మిమ్ము వదలి ముందయినను నడువవల్లఁగాదు. మీరు నాకు గుదెకఱ్ఱలవలెఁ దగులుకొని నాకాలు సాగనీకున్నారు. మీసుకుమారత యంతయు నాయొద్దనే కనబఱుప నక్కఱలేదు. నాలుగడుగులు వేగిరము పెట్టుఁడు. ఇంతలోనే మీకాళ్ళు నొచ్చిపోవు.

హరి—ఓమునికుమారా! కోపపడకుము. మున్నెప్పుడును వీధిలోఁగాలు మోపియెఱుఁగని యీకోమలి పిల్లవాని నెత్తుకొని నడవలేక మెల్లఁగా నడుచుచున్నది.

చంద్ర—ఓబ్రాహ్మణోత్తమా! ఇదిగో నేనునడుచుచున్నాను. మీరునానిమిత్తమయి మెల్లఁగా నడువవలసిన పనిలేదు. వేగిరము కాలు సాగనిండి. అయ్యో! నాకాళ్ళకీరాళ్ళు ముళ్ళవలె గ్రుచ్చుకొనుచున్నవి. (కాలు చూచుకొని) నాయుఱకాలి నెంతలేసిపొక్కు లెక్కినవి! పిక్క లంతకంతకు లావయి నొచ్చుచున్నవి.

హరి—ఓప్రాణనాయికా! నీవెండబడి మిక్కిలి యలసినట్లున్నావు. నీమొగము వాడుపాఱినది; చెక్కులఁ జెమ్మటలు కాలువలు కట్టుచున్నవి. లోహితాస్యు నొకసారి నాచేతికిమ్ము. కొంచెము దూరము నేనెత్తుకొని నడిచెదను.

సత్య—(తనలో) ఈసమీపమున నెక్కడను నీళ్ళు దొరకవు నేనిప్పు డలసినట్టు నటించి, త్రాగుటకు నీరు తెమ్మని యీతనిని మఱింత చిక్కులు పెట్టెదను. (మిట్టనేలను గూలఁబడి నిట్టూర్పు విడిచి) ఓరాజా! నేనిఁక నడుగుదూర మయినను నడువలేను. దాహముచేత దేహము తాప మొందుచున్నది; కాళ్ళు తేళ్ళు కుట్టినట్టు మండుచున్నవి; నో రెండుకొనిపోవుచున్నది; నానాలుకను తడిలేదు; నా దురవస్థ నీతోఁబూర్ణముగాఁ జెప్పుకొనుటకు నోటమాటకూడ రాకున్నది. (హీనస్వరముతో) ఓమాలదైవమా! నన్నీయడవిలో దిక్కుమాలిన చావుచావుమని విధించితివా? ఓతల్లీ! నేనిఁక నిన్నుఁ జూడను గాఁబోలు! ఓగురువర్యా! ఇఁక మీకు శుశ్రూష చేయు భాగ్యము నాకు లభింపదు.

హరి—ఓఋషిపుత్రా! అధైర్యపడకు. నేనిప్పుడే పోయి యెందైనను మంచినీరు వెదకితెచ్చి నీదప్పి తీర్చెదను. ధైర్యము తెచ్చుకొమ్ము.

సత్య—(తడఁబడుచు) ఓరాజా! నీవు మరలి వచ్చినదాఁక నాప్రాణములు నిలువవు. నామన స్సిప్పుడు వృద్ధురా లయిన నా తల్లిమీఁదికి బోవుచున్నది. నాతల్లికి నే నేకపుత్రుఁడను. నీవు నా కియ్యఁదలఁచిన బత్తెమును బుత్రశోకముచేత విలపించుచుండెడు నా తల్లి కిచ్చి యోదార్పుము.

హరి—అయ్యో! ఊరుచేరకుండ మునికుమారుఁడు దారిలోఁ బడిపోయినాఁడుగదా! ఎంత ప్రమాదము సంభవించెను! ఇప్పుడితని నొక్కయూరుచేర్చి రక్షించు నుపాయ మేది?

చంద్ర—ఓప్రాణవల్లభా! మీ రక్కడ విచారించుచు నిలుచున్న కార్యములేదు. ఆలస్యమయిన నితఁ డేమగునో! మీరు శీఘ్ర

ముగాఁ బోయి యెందైన వెదకి నిర్మలోదకములు తెచ్చి బ్రహ్మహత్యాదోషము రాకుండ నీతనిప్రాణములు నిలుపుఁడు.

హరి—ఇదిగో నే నుదకమునిమిత్తము పోవుచున్నాను. నేను వచ్చినదాఁక నీ వీతని కుపచారములు చేయుచుండుము. (అని పోవుచున్నాఁడు)

చంద్రి—(పైఁటచెఱఁగుతో విసరుచు) ఓబ్రాహ్మణోత్తమా! నీవు వ్యసనపడఁబోకు. ఈమహారాజుగా రిక్కడ నున్నట్టే నీరు గొనివచ్చి నీకు దాహశాంతి చేయుదురు. ఆయన వచ్చులోపల నీవీ పండు తినుము. (అని యొకనారింజపండొలిచి తొనలిచ్చుచున్నది)

నక్ష—(తొనలు తిని లేచికూరుచుండి) అమ్మా! ఈఫలరసముచేతను నీవచనామృతముచేతను గొంతవఱకు దాహశాంతియై మరల నానోట మాటవచ్చుచున్నది. బ్రాహ్మణసేవచేత మిక్కిలి పుణ్యము గలదు. నా కాళ్ళు నొచ్చుచున్నవి. కొంచెము నీవుపట్టుము. (అని కాళ్ళు చాచుచున్నాఁడు)

చంద్రి—(కాళ్ళు పిసుకుచు) ఓవిప్రోత్తమా! కొంచెముప శమనముగానున్నదా?

నక్ష—ఓపతివ్రతాశిరోమణీ! నీయనుగ్రహముచేతఁ బ్రాణములు మరల మెల్లగా నాదేహము నిప్పుడు చేరుకొనుచున్నవి. నీవు దొడ్డయిల్లాలవు. ఆజన్మశ్రీమంతులయిన తల్లిదండ్రులకడుపునఁబుట్టి, మహారాజునింటఁ జొచ్చి, కష్టము లెట్టివో యెఱుఁగక నిత్యసుఖము లనుభవించుచుండెడు నీభర్తమూలమున మహారణ్యములలో దుస్సహకష్టములు పొందవలసినయోగము సంభవించినదికదా! అయ్యో! నీవెంత యభాగ్యరాలవు?

చంద్రి—ఓయి వెఱ్ఱిబ్రాహ్మణుఁడా! నీవు తెలియనిమాటలు చెప్పుచున్నావు. పెనిమిటితోఁగూడ నుండుటవలన నాకీకష్ట

ములు కష్టములు కావు. మహారాజకూఁతురయినను భర్తకు బరిచారికయేసుమా ఈయరణ్యములకిట్లు రాఁబట్టియేస్వయముగాభర్తకు సేవచేసెడుభాగ్యమిప్పుడు నాకు లభించినది. నేనెంతమాత్రముభాగ్యహీనురాలను గాను. వేయి యాపదలు వచ్చినను నీతి తప్పక ప్రవర్తించెడు సద్భర్త పూర్వపుణ్యముచేత నాకు లభించుటచేత, ఇల్లాండ్రలో నన్ను మించిన ధన్యురాం డ్రెవ్వరును లేరు.

సత్య—అమ్మా! నీవు నావిషయమయి మిక్కిలి శ్రమపడుచున్నావు. నీయవస్థచూడఁగా నాకు జాలియు దయయుఁ బుట్టుచున్నవి. బ్రాహ్మణసేవ యెప్పుడును నిష్ఫలము కాఁగూడదు. నీవును నీపుత్రుఁడును నావెంట రండు. నేనువిశ్వామిత్రుని కాళ్ళను గడుపును బట్టుకొని బతిమాలి యొప్పించి నీకొమారునికిఁ బట్టాభిషేకము చేయించి మీరాజ్యమును మరల మీకిప్పించెదను. నీభర్త విషయమయి చెప్పిన యెడల మాగురువు నామాట వినునో వినక పోవునో కాని నీకుమారునివిషయమయి నామాట తీసివేయఁజాలడు.

చంద్ర—ఓబ్రహ్మచారీ! ఇప్పుడు నీవుచెప్పినఁ జెప్పితివి కాని యిఁకముం దెప్పుడును నీవు నాతో నిటువంటిప్రసంగములు చేయఁ బోకు. నాకు భర్తయెక్కడనుండునో యదియేరాజ్యము. అరణ్యము లోనయినను నాకాతఁ డున్నచోటనే సమస్తసౌఖ్యములును గలుగును. ఎవ్వఁడో రాక్షసుఁడు పలుకవలసిన యీమాటలు బ్రాహ్మణుఁడవైన నీనోటినుండి వెడలఁగూడదు.

[అప్పుడు దంతఘాతకుఁ డను రాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు]

దంత—(తనలో) నా రాక్షసమాయచేత హరిశ్చంద్రుని దారి తప్పించి యీరాత్రి యూరుచేరకుండ బేతాళవటముక్రిందఁ బరుండునట్లు చేయుమని నన్ను విశ్వామిత్రుఁడు పంపినాఁడు. ఈ రాత్రి యిక్కడశయనించిరా మఱ్ఱిచెట్టుమీఁది బేతాళుఁడు వీరిని హింసింపక విడువఁడు. నామునివేష మిప్పుడు సరిగానున్నదా? నా

చేతిలో రుద్రాక్షమాల మఱచిపోలేను. కుంపటిలోని బూడిదతోఁ
త్రిపుండ్రములు దట్టముగాఁ దీర్చినాను. ఈవ్యాఘ్రాజినమునకు సమీ
పమున దండమును కమండలమును పదిలపఱచినాను. హరిశ్చం
ద్రుఁడు వచ్చెడి యీమార్గములోఁ దావళము త్రిప్పుచు, ముక్కు
పట్టిఁ కన్నులు మూసికొని, జపము చేసికొనుచున్నవారివలె నభిన
యించెదను. హరిశ్చంద్రు డిప్పుడే వచ్చుచున్నాఁడు! (అని వ్యాఘ్ర
చర్మముమీఁదఁ గూరుచున్నాఁడు)

హరి—(ప్రవేశించి) నేనెంతదూరము తిరిగినను వృథా
ప్రయాసమే కాని నీటికొలఁ కెక్కడను గనఁబడ లేదు. నేనాలస్యము
చేసినయెడల నింతలో మునికుమారుఁ డేమగునో! వెళ్ళిన తరువాత
నేనేపాపముమాట వినవలసివచ్చునో! హాదైవమా! ఈమునికుమా
రునకుఁ బ్రాణాపాయము రాకుండ రక్షించి మరల నీతనిని సుఖ
ముగా గురువున కొప్పగించెడు సుకృతము నాకు లభింపఁజేయుము.
అడుగో సమీపమున నెవ్వఁడో యొకఋషి తపస్సు చేయుచున్నాఁ
డు. కన్నులు తెఱచి నావంకఁ జూచుచున్నట్టున్నాఁడు. అతఁడింత
లోనే మరలఁ గన్నులు మూసికొన్నాఁడు. అతని కమండలములో
జల ముండక మానదు. ఈఋషిని బ్రార్థించి కొంచెము జలము
కొనిపోయి ఋషికుమారుని బ్రతికించెదను. (అని సమీపించి) ఓ
తాపసోత్తమా! నీకు నమస్కారము.

దంత—(కన్నులువిచ్చి చూచి) ఎవఁడురా యిప్పుడు మా
తపస్సునకు విఘ్నముచేసి మాయనుసంధానమును జెడఁగొట్టుచున్నా
డు? (అని కన్నులు మూసి యాలోచించి తలయూఁచి) ఆహా! తెలి
సినది. (కన్నులు తెఱచి) ఓరాజోత్తమా! కూరుచుండుము. నీ
వృత్తాంత మంతయు మే మిప్పుడు దివ్యదృష్టిచేతఁ జూచినారము.
నీవుహరిశ్చంద్రుఁడవు. సత్యపరిపాలనము నిమిత్తమయి నీసామ్రాజ్య

మంతయు విశ్వామిత్రునికి ధారపోసి భార్యాపుత్ర సహితముగా నరణ్యములలోఁ దిరుగుచున్నావు.

హరి—(తనలో) ఈమహానుభావుఁ డీశ్వరానుగ్రహముచేత మమ్ము దరిచేర్చవచ్చిన పరమతపోధనుఁడు కాఁబోలును! నా వృత్తాంత మంతయుఁ జూడఁగానే చెప్పినాఁడు. (ప్రకాశముగా) ఓమహాత్మా! నాకిక్కడఁ దడయఁగూడదు. అవలఋషి—

దంత—ఓరాజేంద్రా! నీవు వచ్చినసంగతియు మాకుజ్ఞాన దృష్టిచేతనే తెలియవచ్చినది. నీవు విన్నవింపవలసిన పనిలేదు. సొమ్మునిమిత్తమై మీవెంటఁ దరువువచ్చిన ఋషికుమారుఁడు పిపాసాతురుఁడయి పడిపోఁగా నీవు జలమునిమిత్తమై వెదకుచువచ్చి యెందును గానక జలమున్నచోటు చెప్పుఁడని మమ్మడుగవచ్చినావు.

హరి—సర్వవిదులైన మీతో మనవి చేసికోవలసినపని లేదు. మీకమండలములోని పావనోదకములను గొంచెము దయచేసి విప్రబాలునికిఁ బ్రాణదానము చేయుఁడు.

దంత—ఓరాజోత్తమా! ఈకమండలములోనివి మంత్రోదకములు. ఇవి యెవ్వరికి నియ్యఁగూడదు. జలమక్కఱలేకయే మా తపోబలముచేత ఋషికుమారుఁడు నీవు పోవునప్పటికి సుఖముగా మాట్లాడుచుండును. సూర్యాస్తమానము కావచ్చుచున్నది. మీరు పోయి చేరుటకు సమీపములో నూరేదియు లేదు. ఆలుబిడ్డలతోఁ గ్రూరమృగబహుళమయిన యీమహారణ్యములో నీ వీ రాత్రి యెట్లు వేగింపగలవు?

హరి—ఓమునివర్యా! ఈ రాత్రి భార్యాపుత్రాదులతో మేము విశ్రమించుటకు సురక్షితమయిన తావొక్కటి యనుగ్రహించి మమ్ముధన్యులఁ జేయుము. మీపే రానతిచ్చినయెడల, మీ యాశ్రమమునకు వచ్చి యందీరాత్రి తల దాఁచుకొనెదము.

డండ—నా పేరు డంత. (తనలో) అయ్యో! ప్రమాదము సంభవించినదిగదా! తడవు మాటాడినయెడల నాగుట్టు బయలఁ బడకమానదు. నేను వేగిర మిక్కడనుండి తప్పించుకొని పోవలెను. నేను వచ్చినప్పుడు పేరు పెట్టుకొన మఱచిపోయినాను. ఏమని చెప్పను? జాబాలి యని చెప్పెదను. (ప్రకాశముగా) ఓరాజచంద్రా! నీవేమో యడుగుచున్నావు. మాదృష్టి యంతయు నీశ్వరధ్యానముమీఁద నున్నందున మా చెవులు నీమాటలను వినకున్నవి. మా పేరు జాబాలి; మాయాశ్రమము హిమవత్పర్వతమం దున్నది. మీరక్కడకు రాలేరు. మేము మాతపోమహిమచేత దివ్యమార్గమున క్షణకాలములోఁ బోయి చేరుదుము. మాకనుష్ఠానసమయము సమీపించినది. ఇఁక మాటాడఁదీరదు. మీరువచ్చి నాకుఁ దిన్నఁగా నెదుటనున్న యీమఱ్ఱిచెట్టుక్రిందఁ బరుండుఁడు. (అని వ్రేలితోఁ జూపి యదృశ్యుఁ డగుచున్నాఁడు)

హరి—ఋషీశ్వరుఁ డంతర్ధానమయినాఁడు. పొద్దును వ్రాలిపోయినది. పక్షులును మేఁతలనుండివచ్చి కొలకొలకూయుచు గూళ్ళు చేరుచున్నవి. ఇఁక జీఁకటిపడక మునుపే ఋషిపుత్రిని భార్యాపుత్రాదులను గొనివచ్చి యీచెట్టునీడకుఁ జేర్చెదను.

(అని నడచుచున్నాఁడు)

నక్ష—అమ్మా! చంద్రమతీ! రాజదేపోకగాఁ బోయినాఁడు. అతఁడు మనమిక్కడ నున్నవార్త మఱచిపోయినాఁడేమో! చీఁకటి పడుచున్నది. ఈయరణ్యమును దలఁచుకొనఁగా నాగుండెలు బద్దలగుచున్నవి.

చంద్ర—ఓమునికుమారా! భయపడకుము. ఆఁడుదానిని నేనే భీరురాలననుకొన్నాను. నీవు నాకంటెనుభీరుఁడవుగానున్నావు! అదిగో

నా ప్రాణేశ్వరుఁడు వచ్చుచున్నాఁడు. లేచిసిద్ధముగానుండుము. ఆతఁడు మరల నిప్పుడు భద్రమయిన చోటికిఁ దీసికొనిపోవును.

హరి—ఓనక్షత్రకా! జలము—

నక్ష—ఓరాజా! నాకు జల మక్కర లేదు. చీఁకటి పడకము నుపే నన్ను సురక్షిత మయిన శయనస్థలము చేర్చి బ్రతికింపుము.

హరి— ఓమునికుమారా! నావెంట రమ్ము మనముపరుండఁ దావు చూచి వచ్చినాను. ఓప్రాణేశ్వరీ! లోహితాస్యుని వెంటఁబెట్టు కొని రమ్ము. మనము శయన స్థలమునకుఁ బోదము.

(అందఱును నడుచుచున్నారు.)

చంద్ర—నక్షత్రకా! దారి చూచి నడువుము. అప్పుడేచీఁకటి పడినది. దారితిన్నఁగాఁ గనబడకున్నది.

హరి—అప్పుడే గాఢాంధకారము క్రమ్మి కన్నును మిన్నును గానరాకున్నది. ఓనక్షత్రకా! వచ్చుచున్నావా? ఈచీకటి యిప్పుడు మిట్టపల్లముల నేకము చేసినది.

నక్ష—నా దేహము కంపమెత్తుచున్నది.

క. పాములు కడు బుసకొట్టెడు;
నామూలను గాంద్రు గాంద్రు మనియెడుఁ బులుల్;
నామన సగలెడు భయమున
భూమీశా! పట్టుకొమ్ము పొదిగిట నన్నున్.

హరి—ఓమునికుమారా! నీకు వచ్చినభయము లేదు. ఇదిగో నేను చేయి చాఁచుచున్నాను. నన్ను వచ్చి పట్టుకొనుము. ఇదిగో నీహస్తము దొరకినది.

లోహి—నాన్నగారూ! ఈచేయినాది.

నక్ష—(తడవుకొనుచు) ఓరాజేంద్రా! నన్ను గిల్లుచున్నా వేమి? నీహస్తము ముళ్లకంపవలె నెంతకఱకుగా నున్నది!

హరి—నీవు కంపమీఁదఁ జేయి వేసినట్లున్నావు. నాకంఠస్వరమునుబట్టి కొంచెము కుడివైపునకుఁ దొలఁగి నడువుము.

నక్ష—(ఏడ్చుచు) ఓరాజేంద్రా! నన్నుఁ బాము కఱచినది కాఁబోలును! నా నడిమివ్రేలు చిమచిమలాడుచున్నది. ఏమిబుద్ధి? నాకిక్కడ విషవైద్యులెవ్వరు దొరకుదురు? మందు వేయువా రెవరున్నారు? ఓయీశ్వరుఁడా! నే నీరాజుమూలమునఁ జూచుచుట్టమును మ్రొక్కుదైవమును లేక మహారణ్యమధ్యమున దిక్కుమాలినపక్షినయి చచ్చి నక్కలపాలగుచున్నానుగదా! అయ్యో! తుదకు నాకు దహనసంస్కారమయిన లేకపోయెనా?

హరి—ఓమునీంద్రా! నీవు లేనిపోనియాయాస మేల పడియెదవు? పాములుక్రింద నుండును గాని పయి నెక్కడ నుండును? నీకు గ్రుచ్చుకొన్నది. ముల్లు నీపిఱికి తనమును విడిచిపెట్టుము. చా విన్ని సారులు వచ్చునా?

ఉ. భీరుఁడు చావు చావనుచు వేమఱునుర్విన్ మరణార్తి నొందెడున్;
ధీరుఁడొ యొక్కసారియె మృతిం గనునప్పుడు బాధ నొందెడున్
ధారుణి దేహధారులకుఁ దప్పక చా వెపుడైన నుండఁగా;
నూరక చావుకై వగపు నొందఁగ నేటికి మాటి మాటికిన్?

నక్ష—ఓరాజా! బ్రాహ్మణోత్తముఁడ ననియైనఁ జూడక పిఱికివాఁడు చావులేకయే గడియగడియకును మరణవేదన నొందుచుండునని నన్నాక్షేపించుచున్నావుగా? ఈయాక్షేపణ మఱచిపోకుము. నేనే యుత్తమబ్రాహ్మణుకొడుకు నయినపక్షమున నే నెప్పటికైన నీపగ తీర్చుకొనకపోను. నేను బట్టుకొన్న యీహస్త మెవరిది?

హరి—నాదే నీవిఁక గుండెబెదరు తీఱి యుండుము. ఓలోహితాస్యా! నీవు మీయమ్మను విడువకున్నావా?

చంద్ర—లోహితాస్యుఁడు నాచంకనున్నాఁడు. మునికుమారుని మీఁరువదలకుఁడు. మనమునిలువవలసినచోటెంతదూరమున నున్నది?

హరి—ఇదిగో సమీపించినారము. ఈచెట్టుక్రిందనే మన మీరాత్రి విశ్రమింపవలెను. ఈయంధకారమునకుఁ దోడు నీలమేఘములు కూడ మనలను జుట్టుకొన్న మాయాంధకారమువలెనే యాకాశమునఁ గాఁ యుక్రమ్ముకొన్నవి.

నక్ష—నాకఱకాలుమొదలు శిరస్సువఱకును వ్యాపించి శీతజ్వరమువచ్చినట్లు వణకు వచ్చుచున్నది. మీ మాటలు చాలించి చలిపోవ నాకేమైన బట్టలుకప్పుఁడు.

హరి—ఓప్రాణేశ్వరీ! ఈమునికుమారునిశరీర మెత్తుకొనకుండఁ గొన్నిబట్టలు మెత్తగాఁ బ్రక్క వేసి, కొన్నిబట్టలు మీఁదఁ గప్పి మనమధ్యను బరుండఁబెట్టుము.

చంద్ర—అలాగే చేయుచున్నాను.

(అని చెప్పినట్లు చేయుచున్నది)

నక్ష—(పరుండి నిద్రపోవుచున్నాఁడు)

హరి—ఈతఁ డెంతలో నిద్రపోయినాఁడు! ఆహా! ఏమి యీతనిగుఱ్ఱు పయియుఱుములతో వియ్య మందుచున్నది!

చంద్ర—వర్ష మారంభ మయినది. ఆకులమీఁద జినుకులు పడుచున్నవి.

హరి—లోహితాస్యునిగూడఁ బరుండబెట్టి పయిని బట్ట కప్పినావా?

చంద్ర—నాచీరచెరఁగు కప్పినాను. ఈ వాన సంతతధారగాఁ బడుచున్నది. ఈయుఱుములును వర్షధారలును జూడఁగా, ఆకాశము మనకష్టములనుజూచి యేడ్చుచు గన్నీరు విడుచుచున్నట్టున్నది.

హరి—ఓప్రాణేశ్వరీ! ఈమఱ్ఱికొమ్మలనుండి దిగజాఱెడి వర్షధారలను జూడుము.

క. మెఱుముల వెలుఁగున నల్లవె
వఱలెడుఁ గొమ్మలను జాఱువర్షపుధారల్
మఱిమఱి లావై నిడుపై
యొఱ పగుచున్నట్టిమఱ్ఱియూడ లనంగన్. 18

(కొంచెముసే పూరకుండి) నాప్రియురాలికిఁగూడ నిద్ర పట్టినట్టున్నది. వాన యింకను దిన్నగాఁ బోకపోయినను మార్గాయాసపడియున్నప్రాణము లగుటచేత వీరి కందఱికి గొడుగువలె నున్న యీవిశాలశాఖక్రిందఁ గునుకుపట్టినది. ఇఁక నే నీ కత్తిని ధరించి వీరికిఁ గావలి కాచెదను. ఈబ్రాహ్మణునిగుఱ్ఱు చూడఁగా, నాకీచెట్టుమీఁదఁబిశాచములున్నను బెదరి దిగిపాఱిపోవునని తోఁచుచున్నది. ఈమఱ్ఱియూడనుండి భల్లూకమో యేదో దిగుచున్నట్టున్నది. (అని నిలిచి చూచుచున్నాఁడు.)

భూతము—పెద్దకాలమునకు నాకు మనుష్యమాంసము లభించినది. ఈబాలకు నెత్తుకొనిపోయెదను.

హరి—ఓహోహో! ఇది భూతమువలె నున్నదే! (అని చేరఁబోయి యొకభూతమును జుట్టు పట్టుకొని యీడ్చుకొను వచ్చుచున్నాఁడు.)

భూత—ఓమహాప్రభూ! నన్నువిడిచిపెట్టుము. నేనీవృక్షము నాశ్రయించియుండు కపాలకుండలుఁ డనుపిశాచరాజుసేవకుఁడను. సంచారార్థము పోయియుండిన మారాజీపాటికి వచ్చుచుండును.

హరి—మేమున్నచోట భూతములుండఁగూడదు. భయార్తుని సంహరించుట ధర్మము కాకపోయినను నీవు మావారిమీఁదికి దిగి వచ్చినందునకయి నిన్నూరక పోనియ్యరాదు. ఈకత్తితో నీముక్కిప్పుడు కోసి మఱి వదలిపెట్టెదను. దిక్కున్న యెడల నీవుపోయి నీనాయకునితోఁ జెప్పుకొమ్ము. (అని ముక్కుకోయుచున్నాఁడు.)

భూత—(పెద్దపెట్టున నేడ్చుచు ముక్కు చేతఁబట్టుకొని పరుగెత్తుచున్నాఁడు.)

హరి—అదియేమి ? ఈచెట్టుకొమ్మలనుండి కోఁతులవలె గుభిల్లునదుమికి భూతములు కాఁబోలును నానాముఖములఁ బరుగెత్తుచున్నవి. ఆపైపున నాకోలాహలమేమి?

[తెరలో బేతాళుఁడు.]

శా. ఔరౌరా! యొకమానవాధముఁడు మిమ్మత్యంతగర్వంబునన్
దోరింపం గమకించెనే? యితని నార్తు న్నాసికం గోసెఁగా?
వీరుండై నకపాలకుండలుని నన్ విన్నాఁడె? యీశుంఠ దు
ర్వారం బైనమదీయకోపశిఖలో గ్రుందు న్నిమేషంబునన్.

హరి—ఇప్పుడు నాచేత ముక్కు చెక్కఁబడినవాఁడు పోయి తనప్రభువైన బేతాళుని గొనివచ్చుచున్నాఁడు. వీరికి నిద్రాభంగము కలుగకుండ నేను వీనిని దూరముగాఁ గొనిపోయి యీశితాసిచే శిరస్సు ఖండించెదను.

[కపాలకుండలుఁడు ప్రవేశించుచున్నాఁడు]

కపా:—

శా. ఓరీ! నీ విటు కండ క్రొవ్వున మదీయోర్వీజముం జేరి శం
కారాహిత్యమునన్ మదీయభటులన్ గారించినా వేమిరా?
ధీరుల్ మెచ్చఁగ నిన్వధించి యిపు డర్థి న్మద్భటశ్రేణికిన్
గూరల్ చేసెద నీదుమాంసచయమున్ గొంతుబ్బ భక్షింపఁగన్

హరి:—

శా. ఓరోరీ! వదరంగఁ బోకు మిట గర్వోక్తు ల్గదుం బ్రేలినన్
గ్రూరాసిం గొని యాకరంబున నెనేఁ ద్రుంతున్ శిరంబియ్యెడన్;
ఘోరాకారత నున్నసీతను విటన్ శుల్పీడ పోవంగ నా
హారం బౌఁ బదివేలనక్కలకు నత్యంతంబు సంతృప్తిగన్. 21

పంచచామరము. కరంబు గూర్కి యున్నవీరు గాసి చెందకుండఁగా
బిరాన దవ్వు గాఁగఁ బొమ్ము ప్రేల కింక నిచ్చటన్,
దరంబు మాలి నిల్చితేని దవ్వు గొంచుఁ బోయి నీ
శిరంబు ద్రుంచువాఁడ కత్తిచేత నొక్క వ్రేటునన్. 22

కపా:—

ఉ. ఏమిర! కండకావరము? హీనమనుష్యుఁడ నన్నుఁ ద్రుంచుఁగా?
యామహి నేఁడు నేనుభుజియింపఁగఁగంటి మనుష్యమాంసమున్
సోమరి యాచు వఁటయిలు చొచ్చెను గుండెలు; తప్పిపోవునే?
చీమల భల్లుకంబువలెఁ జెంగున మ్రింగెద మిమ్ము నందఱన్.

(అని మీఁదికి వచ్చుచున్నాఁడు.)

హరి—(వారిని జుట్టు పట్టుకొని పిడికిలియెత్తి)

మ. ఇదిగోఁ జూడుము వజ్రపాతనిభమౌ యీముష్టిఘాతంబునన్
బదియార్వ్రక్క లగున్ శిరం బిచటఁ గాల్వగట్టఁ గ్రొన్నెత్తురుల్
ముదముం జేసెద నింక నీవటమహాభూజంబుక్రింద న్నిశల్
నిదురం జెందెడు పాంథలోకమునకున్ నేఁ డాదిగా దుర్మతీ? 24

(అని యీడ్చుకొని పోవుచున్నాఁడు.)

[తెరలో]

కపా-ఉ. భూతములారా! రండు; పెనుభూత మొకండిదె నన్నుఁ బట్టి ని
ర్ఘాతసమానముష్టిహతి వ్రచ్చె శిరంబు; కరంబు ముక్కునన్
వాతను నెత్తురుల్ వఱదవాఱెను; మీప్రభు నన్నుఁగావరే;
భీతి వడంకెడున్ దనువు; పెల్లుగఁ బ్రాణము తల్లడిల్లెడున్ 24

నక్ష—(ఉలికిపడి లేచి) అయ్యో! పిడుగువంటిశబ్ద మేదో నా చెవులఁబడి గుండెలు పగులుచున్నవి. నా దేహము కంపమెత్తుచున్నది; ఈ వెలుతు రెక్కడిది? వీరందఱు దేహము తెలియఁగక పడి నిద్రపోవుచున్నారు. హరిశ్చంద్రుఁడు మమ్మువిడిచి పారిపోయినట్లున్నాఁడు.

ఎవ్వఁడో యీయూడలనుండిదిగి పాఱిపోవుచున్నాఁడు. ఓచంద్రమతీ! ఓలోహితాస్యా! లెండు లెండు. మన మీయర్ధరాత్రి నిద్రపోయి మోసపోయినాము.

చంద్ర—(లేచి కన్నులు నలుపుకొనుచు) ఓబ్రాహ్మణోత్తమా! చెడుకలగని పలవరించుచున్నావా యేమి? మేము నీచెంతనే యున్నాము. భయపడకు నీకు నిద్రలోను భయమే.

నక్ష—నన్నొంటివానిని జేసి మీరందఱు నిద్రపోవుచున్నారు. ఏదో భూతము చెట్టుమీఁదినుండి దిగి నామీఁదనుండి పఱుగెత్తినది. నేనెట్లు భయపడకుండఁగలను? నాభయమే నన్ను రక్షించుచున్నది.

చంద్ర—భూతమును లేదు పిశాచమును లేదు. మరల ముసుఁగుపెట్టుకొని మాటాడక పరుండుము. నీకేదో పీడకలవచ్చినది.

నక్ష—కలకాదు. నేనీకన్నులతోఁ బ్రత్యక్షముగాఁ జూచినాను. ఈమఱ్ఱియూడనుండి దిగి పఱుగెత్తినది.

చంద్ర—(తేఱిపాఱఁజూచి) అమ్మో! నాప్రాణనాథుఁడెక్కడనున్నాఁడు?

హరి—(ప్రవేశించుచు)

మహాస్రగ్ధర.

అలఘూద్యత్ఖడ్గధారా హతఘనగళుఁడై యుద్రిరాజం బనంగా
నిలఁగూలె న్వైరి పీఱుండిటు రుధిరచయం బేరులై నేలఁబాఱన్;
గలఁకం దద్భృత్యులెల్లన్ గడురయమున శాఖామృగవ్రాతరీతిన్
బలుశాఖల్దూఁకి భీతిన్ బఱచెద రదె దిగ్భ్రాంతి నల్దిక్కులందున్. 26

చంద్ర—ఈబ్రాహ్మణునికల యూరకపోలేదు. మాకపాయము చేయవచ్చిన దురాత్మునెవ్వనినో సంహరించి భర్త వచ్చుచున్నాఁడు. నే నెదురుగాఁ బోయెదను. (రెండడుగులు నడిచి) ఓప్రాణేశ్వరా!

హరి—హృదయేశ్వరీ! తొందరపడఁబోకుఁ. చిమ్మచీఁకటిలో మీరు శరీరములు మఱచి నిద్రపోవుచున్నప్పుడు మీ కపాయము చేయ వచ్చిన యామఱ్ఱిచెట్టుమీఁది భూతాదులను దఱిమిపాఱదోలి, భూతనాయకుఁడగు బేతాళుని నేనిప్పుడే భూమికి బలిచేసివచ్చినాను.

నక్ష—భూతముల పేరు చెప్పిన నామేను వడఁకుచున్నది. ఇఁక నొకయర్ధనిమిషమయినను నేనీదయ్యములమఱ్ఱిక్రింద నుండను. నన్నా వెలుతురు కనఁబడుచున్నదిక్కునకుఁ దీసికొనిపొండు.

హరి—అర్ధరాత్రమిప్పు డీయోరుగాలిలో దారిలేని మహారణ్యమధ్యమున మనమిప్పు డెక్కడికిఁ బోఁగలము? ఆకనఁబడునది దవానలమేమో! అది గార్చిచ్చైనపక్షమున స్త్రీలతోను శిశువులతోను గటికచీఁకటిలో బరుగెత్త లేక త్రొక్కులాడి, ముల్లుతీసి కొఱ్ఱ డఁచుకొన్నట్లు మఱింతశ్రమపడవలసివచ్చును. నీవేలాగుననైన మా ప్రార్థన విని మానిమిత్తమయి కొంచెము ప్రయాసపడి నేఁడు తెల్ల వాఱినదాఁక నీ చెట్టుక్రింద శయనింపుము.

నక్ష—నీవిఁక లక్ష చెప్పినను నేను వినను. ఏభూతమయి నను నన్ను నోటవేసికొని పోయినపక్షమున, నప్పు తీర్పుమని యడుగువారు లేక సుఖపడవచ్చునని మీరనుకొన్నారు. నాముందఱ యీయాటలు సాగిరావు. ఇప్పుడామంటయొద్దకుఁబోయి చలికాచుకొని పొలములోనిపర్ణశాలలో నేనీ రాత్రి పరున్నఁగాని బ్రదుకను. మీరు రానిపక్షమున నురిపెట్టుకొని యిప్పు డిక్కడఁ బ్రాణములు విడిచెదను.

చంద్ర—ఓభూసురోత్తమా! ఆమంట కార్చిచ్చేమో!

నక్ష—అది కార్చిచ్చు కాదు. పొలములోఁ గాపులుచలి నిమిత్తము వేసికొన్నమంట.

హరి—అట్లయినఁ బోదము రండు.

అందఱు—(కొంచెము నడుచుచున్నారు)

నక్ష—ఇదియేమి? మన వెనుకవంకఁగూడ మంట కనఁబడుచున్నది.

చంద్ర—ఒక్క వెనుకదిక్కుననే కాదు. మనకుడియెడమ గూడ దూరమున మంటలు లేచుచున్నవి.

నక్ష—(నలుదిక్కులుచూచి) మీరు కార్చిచ్చు కార్చిచ్చని మొదటనే వాక్యముపెట్టినారు. మీదెట్టిపాపపునోరో కాని మీమాటే నిజమయినది. మీమూలమున బీదబ్రాహ్మణుఁడ నయిన నేనిప్పు డగ్నిహోత్రున కాహార మగుచున్నాను. ఓవైశ్వానరా! బ్రాహ్మణహత్య మహాపాతకముసుమా! నీవీ పేద బ్రాహ్మణునిజోలికి మాత్రము రాకుము. అయ్యో! ఏమిచేయుదును? మంట లాకాశమంటుచున్నవి.

హరి—ఓహో! అగ్నిహోత్ర మెంతలో వ్యాపించుచున్నది!

గీ. దుష్టులిద్దఱు తమలోన దొమ్ములాడి
సాధుజనులకు మహిఁ గీడు సలుపునట్లె
యెండుమ్రోడులు రాచుకొం చిట్లు వహ్నిఁ
గలుగఁజేసి వనంబెల్ల! గాల్పఁదొడగె.

చంద్ర—ఓప్రాణేశ్వరా! మంట లన్నిప్రక్కలనుండియు వచ్చి చుట్టుకొనుచున్నవి. మన మీ దవాగ్నినుండి తప్పించుకొనుమార్గము కానరాకున్నది. మీరొంటిగానున్నయెడల నెట్లయినను దప్పించుకొని యుందురు. నానిమిత్తమున మీరును భాగ్యహీనులగుచున్నారు. ధనబంధము వీడినట్లే కాలిసంకిలివలె నున్నభార్యాబంధముకూడ వీడియుండినపక్షమున మీకీచిక్కు లేకపోవునుగదా?

హరి—ఓప్రియురాలా! అట్లనఁ బోకు. నీవు నన్ను విడువకుండఁబట్టియే నేనిప్పుడు మహాగ్నిమధ్యమున నుండియు సంతాపము పొందకున్నాను. నేను భాగ్యహీనుఁడనుగాను; ధనహీనుఁడనుగాను.

మహాపదలు వచ్చినప్పుడును విడువని బహిఃప్రాణముగు భార్య చెంత నుండఁగా లోకములో నాకంటెను భాగ్యసంపన్నుఁ డెవఁడు? నీస్నేహధనమే కాక నీతిధనముకూడఁ గావలసినంత యున్నప్పుడు, నే నేల ధనసంపన్నుఁడను గాకపోదును? అందఱిలోను నే నే ధన్యతముఁడను.

నక్ష—కావలసినవా రందఱు నొక్కచోట నుండుటచేత మీ రందఱు ధన్యతములే. ఎవ్వరును లేక యొంటిగాఁడ నైన నే నొక్కఁడనే యిందు మందభాగ్యుఁడను. మాతండ్రియైనను బ్రతికి యున్నపక్షమున మరణకాలమునందు నందనుని విడిచిపెట్టక కొంచెమోదార్చునుగదా? ఓదైవమా! నన్నిట్లేకాకిని జేసితివా?

హరి—ఓమునికుమారా! దుఃఖపడకుము. మాప్రాణములు పోయినతరువాతగాని నీకుఁ బ్రాణాపాయము రాదు. మేమీచిచ్చులో నుఱికి వీపుమీఁద మోదుకొనిపోయి యయినను, నీప్రాణరక్షణముఁ జేసెదము. అక్కటా! అగ్ని యంతకంతకు సమీపించుచున్నది! ఈప్రాణరక్షణ మెట్లు సంభవించును?

చ. చిటచిటవిస్ఫులింగములు చెంతల నెంతయు వింత మీఱఁగాఁ,
పెటపెటనాదము ల్పొదలఁ బెక్కులు పండువెదుళ్లు వ్రీలఁగాఁ,
పుటపుట ధూమసంచయము భూమియు నింగియు నావరింపగాఁ,
గటగట! యన్నిప్రక్కలను గ్రమ్మెను మమ్ము దవాగ్ని యియ్యెడన్.

చంద్ర—ఓప్రాణేశ్వరా! ఇప్పుడు మన మీ మునికుమారుని ప్రాణరక్షణము చేయకపోయినయెడల మన కపకీర్తి వచ్చును. ధనమియ్యవలసివచ్చునని మన మీతని ప్రాణముల కెగ్గు చేసితిమని లోకము తలంచినను దలఁచును. ఋషీశ్వరునిఋణము తీర్చి ధర్మము నిలుపుకొనుటకయి మీరును సర్వవిధముల నాత్మరక్షణము చేసికొనవలయును. మనుష్యుఁడు ప్రపంచమునకువచ్చునప్పుడు దానొంటిగా నే వచ్చును. ప్రపంచమునుండి పోవునప్పుడును దానొంటిగా నే పోవును.

ధర్మ మొక్కటిమాత్రమే మరణానంతరమునను వెంటవచ్చును. కాఁబట్టి మీరు దారాదిబంధమును గోసివేసి ధర్మ రక్షణోపాయమున కనుజ్ఞ యియ్యవలెను.

హరి—ఓ ప్రాణనాయికా! నా కేమియు నపాయము తప్పించుకొనుట కుపాయము తోఁచకున్నది.

చంద్ర—నాకొక్క చక్కని యుపాయము తోఁచుచున్నది. మీ రందున కొడఁబడవలెను. ఈప్రక్క నొక్కనిలిచెడుమేర మాత్రమే నిప్పుమండుచు, దీని కావలదారి కనఁబడుచున్నది. నే నడ్డముగాఁ బరుండి యగ్నిహోత్రమున కాహారము నయ్యెదను; మీరీ యిరువురును దీసికొని నామీఁదనుండి నడిచి మార్గమునఁబడి ప్రాణరక్షణము చేసికొనుఁడు. ఇన్నిప్రాణము లొక్కసారిగాఁబోవుటకంటె నొక్క ప్రాణము పోవుట శ్రేయస్కరముకదా!

హరి—హరహరా! ఎంతపాపపుమాట యిప్పుడీచెవులఁబడినది! ఈ మాటలు నా చెవులయందు సూదులకంటెను దీక్ష్ణముగా నాటి మనస్సుకలంచి యింద్రియముల నవశము చేయుచున్నవి. ఇట్టి దారుణవాగ్విషబాణము నాటియు నా ప్రాణములుపోకున్నవి. (అని మూర్ఛపోవుచున్నాడు.)

చంద్ర—ఓ బ్రాహ్మణోత్తమా! మూర్ఛ తేరినతరువాత నా ప్రాణవల్లభుఁడు నా చావున కంగీకరింపఁడు. ఇఁక జాగుచేయుట కవకాశము లేదు. నేనీ యగ్నిహోత్రమున కడ్డముగాఁ బడెదను. నీవు నాపాణివల్లభునిఁ బుత్రునిఁ గొని నా మీఁదనుండి నడిచి మీప్రాణములను రక్షించుకొనుఁడు. (అని అగ్నికెదురుగా నడుచుచున్నది.)

లోహి—అమ్మా! నేనుగూడ నీతోనే వచ్చెదను. నన్నుఁ దీసికొనిపొమ్ము.

చంద్ర—నాయనా! నేనిప్పు డీ యగ్నినార్చి నిన్నావలకుఁ దీసికొనిపోవుటకయి త్రోవ చేసెదను. నీవు నాన్నగారివద్దకుఁబొమ్ము. (అనికన్నీరు నించుచున్నది.)

సత్య—లోహితాస్యా! యీతల్లినివిడిచి నీవిటురా.

చంద్ర—నాకుఁ దల్లిదండ్రులు చెప్పించినవిద్య సార్థకమగునట్లాశుకవిత్వముగా దండక మొకటి చెప్పి యిప్పు డిప్పావకుని మెప్పించెదను. (అని యగ్నిహోత్రుని కభిముఖురాలయి సమీపించి చేతులు జోడించి దండకము చదువుచున్నది.)

దండకము—శ్రీమన్మహావాయుమిత్రా! పవిత్రా! లసద్దీపహోత్రా! జగత్ఖ్యాతచారిత్ర! నేనీమహత్త్వంబు వర్ణింపఁగా నెంతదానన్? కృపాదృష్టివీక్షించి రక్షింపుమో హవ్యవాహా! చలజ్జ్వాలికాజాలజాజ్వల్యమానోన్నతత్త్వాజసందోహ! లోకంబులెల్లన్ భవన్నిస్తుల ప్రేమచేఁ గాదె సంపూర్ణసౌఖ్యంబులం బొందు? నీవెల్లచో స్వస్వరూపంబులం దెల్లగూఢంబుగా నుండు వత్యంత మర్మన్; మానవుల్ తాము రుచ్యంబు లౌభక్ష్యముల్ శాకపాకాదులున్ జిహ్వకుం దృప్తిగాఁ జేసికొంచున్ సుఖం బొందఁగాఁ గల్గుటల్ నీప్రసాదంబునం గాదె? శీతంబుచే బాధ పొందంగ నీవెంతయున్ బీదలన్ సాదరన్ బ్రోవవే? రాత్రులం జీఁకటుల్ క్రమ్మ సర్వేశ్వరుం డిచ్చియున్నట్టి నేత్రంబులన్ వ్యర్థముల్ చేయ దీపాళిరూపంబునన్ నేత్రసాఫల్యముం జేసి కారుణ్యముం జూపవే? వ్యాధివర్గంబుఁ బుట్టించు నానావిధాశుద్ధవస్తుప్రపంచంబు భక్షించి లోకాళి కారోగ్యముం గూర్పవే? చాలఁగా నిన్ను నేస్తోత్రముల్ చేయఁగాఁ జాల; నేనీధరిత్రిన్మహాసాధ్వి నౌదేని, నాభర్త సత్యవ్రతుండేని, యోపావకా! వేగ నా మొఱ్ఱ యాలించి పాలింపుమా యిమ్మహీదేవపుత్రున్

పవిత్రుఁడ, ధరిత్రీకళత్రుఁడ, మదీయైకపుత్రుఁడ; నమస్కారముల్ నీకు వేవేలు కావింతు; దేవా! నమస్తే నమస్తే నమస్తే నమః

నక్ష—ఓహో! ఈమెమహిమచేత దవాగ్ని యెంతలో మరలి పోయినది! ఓమహారాజా! మనము బ్రతికినారము. కన్నులు విప్పి చూడుము.

హరి—(కన్నులువిచ్చి) అయ్యో! నావ్యధ యధికముచేయుట కయి నన్నిప్పుడెవ్వరు మూర్ఛ తేర్చినారు? ఈమూర్ఛమూలము నయినను నిమిషకాలము దుఃఖమును మఱచి యుండఁగా నింతలోనే యిట్టిపాపమును గట్టుకొఁజెల్లునా? హా! ప్రాణనాయికా! నేనిఁక నెట్లుజీవనములు నిలుపుదునే?

చంద్ర—ఓహృదయేశ్వరా! ఈశ్వరానుగ్రహముచేత నేను సుఖముగా నేయున్నాను. నానిమిత్తమయి మీరు చింతపొందఁ బోకుఁడు. (అని చేరవచ్చి కౌగిలించుకొని లేవఁదీయుచున్నది.)

హరి—చల్లని నీహస్తస్పర్శమువల్ల నాయుల్లమిప్పుడు చల్ల పడినది. నీవుబ్రతికి నన్ను బ్రతికించినావు.

నక్ష—ఓమహారాజా! నిన్నొక్కనినేకాదు. మమ్మందఱిని గూడ నిప్పుడీపతివ్రతాతిలకమే బ్రతికించినది.

చంద్ర—ఇప్పుడు మాటల కెడములేదు. ఈకార్చిచ్చింకను మనదిక్కున మండుచునేయున్నది. ఈవంకను మనకుఁ ద్రోవ యిచ్చి నది గనుక, మన మీచోటుదాటి దారిలోఁబడి యావల సావ కాశముగా మాటలాడుకొందము రండు.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థాంకము

రంగము—కాశికాపురవీధి.

[హరిశ్చంద్రుఁడును, చంద్రమతియు, లోహితాస్యుఁడును; నక్షత్రకుఁడును, ప్రవేశించుచున్నారు.]

చంద్ర—ఓప్రాణనాథా! ఈదివ్యక్షేత్రమునకు వచ్చి యిరువదిదినములయినను, మనమింకను గాశికాపురమునందలి దివ్యస్థలములనేకములు సేవింపనేలేదు. అవిముక్తక్షేత్రమున జూడలేదు; కేశవస్వామిని దర్శింపలేదు; జ్ఞానవాపిని కనలేదు; కేదారశంభులింగ దర్శనము చేయలేదు; ఢుండివిఘ్నేశ్వరుని బొడగనలేదు; వరుణానదియందు స్నానము చేయలేదు. వచ్చినతరువాత నాలుగయిదుదినములు మార్గాయాసముచేత నిల్లుకదలలేకపోయినాము. నక్షత్రకుని యుపచారములమూలమునఁ గొన్నిదినములు తీఱలేదు.

హరి—ఓహృదయేశ్వరీ! మనమిప్పుడ విముక్తక్షేత్రమునకుఁ బోవుచున్నాము. ఉన్నదివ్యస్థలముల నన్నిటిని నేటరేపటఁ బోయి సేవింతము.

క. హరుఁడిటఁ దారకమంత్రము
మరణింపుచునున్నజంతు మండలిచెవులన్
బరువడి నుపదేశించును
గరుణామయి న్నిత్యముక్తిగలిగించుటకున్. 1

ఉ. ఓలినిసప్తవాయువులు నొక్కట వీవఁగ ద్వాదశార్కులా
భీలత నెండకాయఁగను, భీకరపుష్కల ముఖ్యమేఘముల్
చాలఁగ వర్షముల్ కురియ, సప్తసముద్రము లొక్కపెట్టునన్
వేలనుమించిరాఁ, బ్రళయవేళను గాశినశింపఁ దింతయున్. 2

చంద్ర—నిస్సందేహముగా మన మీ కాశికాపురసందర్శనముచేతనే ధన్యులమైనాము. ఇప్పుడు మేఘగర్జనమువలె నాచెవుల కేదో మ్రోఁత వినవచ్చుచున్నది. అది యేమయి యుండును?

హరి—అది గంగాప్రవాహఘోషము ఆవంకఁజూడుము.

ఉ. అల్లతరంగడోలికల హంసము లూఁగెడు మెల్లమెల్లఁగాఁ;
దెల్లనినీరు కూలనిహారిణిఁ బెనుముత్యము లట్లులేచెడున్;
జల్లనిగాలి వీచెడును సౌరభముల్ వెదచల్లు చల్లనన్;
నల్లలితప్రశస్తినదె జాహ్నవి పొల్చెడు నేత్రపర్వమై. 3

ఓప్రియురాలా! నాచెయిచాయఁ దిన్నఁగాఁ జూడుము.

ఉ. మేలిమిపైడి పూఁతలను మెచ్చులుగుల్కెడు చిత్రజంతులన్
జాలఁగ నొప్పిమిన్నలముచక్కని గోపురమందు గుంపులై
చాలుగఁ బావురంబు లవెసందడిచేయఁగ విశ్వనాథు దే
వాలయమాదెసన్ దవుల నల్లదె చూడ్కికి వేడ్కగొల్పెడున్. 4

(చూపుచున్నాఁడు.)

నక్ష—ఓరాజా! మీరు కృతార్థులయినారు.

క. వినుమీ కాశీపురమున
నొనరంగా నైదుదినము లుండినఁ జాలున్
జనుఁడఘము లెల్లఁ బోనిడి
యనఘుంబగు ముక్తినొందునందురు పెద్దల్. 5

చ. ఇరువదినాళ్లు నేఁటితుద కీపురి నీవు వసించియుంట నీ
కరగతమయ్యె ముక్తి; యటుగావున నీవిఁకలత బొంకినన్
బరము నిహంబునుం జెడవు; నమ్ముము కాసయినన్ లభింపదీ
పురమున నీకు; నప్పెఱుఁగ బొమ్మని బొంకుము నేను బోయెదన్. 6

హరి—ఓబ్రాహ్మణోత్తమా!

చ. తలఁపగ బోకు విశ్వేశ్వరుఁడు తానొకచోటనె యుండునంచు, నీ
స్థలమె పవిత్రమై జనులఁ దద్దయు శుద్ధులఁజేయునంచు; నె
ల్లెడలను నిండియుండుఁ బరమేశుఁడు; వానికి విశ్వమంతయుఁ
నిలువఁగ నాలయంబె యగు; నిక్కమె యాతని యాజ్ఞ యెల్లెడన్ 7

క. సత్యముపలుకని మనుజుఁడు
నిత్యంబుగఁ గాశి నున్న నిజముగ నఘరా
హిత్యముపొందఁడు; దెలిసి య
సత్యముపలుకుదునె యల్పసౌఖ్యము కొఱకున్? 8

కొంచెంసేపు తాళుము. నేఁ డెట్టులయిన సూర్యుఁ డస్తమించులోపల నీధన మిచ్చి ఋణవిముక్తుఁడనయ్యెదను.

వశి.—ఓహోహో! నీమాటలు వాటముగానున్నవి.

సీ. విశ్వేశ్వరునిఁ బోయి వీక్షింతునీవేళ
నుండు నేఁటి కటంటి వాక్కునాఁడు
మణికర్ణికను గ్రుంకి ప్రణుతింతునీవేళ
నుండు నేఁటి కటంటి వాక్కునాఁడు
తల్లిభాగీరథి దర్శింతు నీవేళ
నుండు నేఁటి కటంటి వాక్కునాఁడు
చేరి విశాలాక్షి సేవింతునీవేళ
నుండు నేఁటికటంటి వాక్కునాఁడు

గీ. కాలభైరవు నీవేళఁ గాంచఁ జనుదు
నుండు నేఁటికటంటి వీవాక్కునాఁడు
నేఁడు నేఁడని సామ్మీక నీవుగడప
నెంతకాలంబు తాళుదు నింక నేను? 9

ఉ. రాజ్యసుఖంబుల న్మరగి రాజసవృత్తిని నున్ననీకు వా
ణిజ్యము చేతఁ గా దలవణిక్కులరీతిని; బ్రాహ్మణాకృతిన్

బూజ్యత భిక్షమెత్తి ధనముం గడియింపఁగలే! విఁ కెట్టి లీ
రాజ్యములోనఁ దేఁగలవు ద్రవ్యము మాఋణ మెల్లదీర్పఁగన్? 10

చ. గడవుదినంబు నేఁడె; యుఱకాసయినం జెయిచేర్పలేదు; నీ
యెడ మొక మోటముం గదిరి యేనిట నూరక యున్నమద్గురుం
డుడుగని కిన్కతోడ ననునొక్కట మ్రింగును; నిన్ను నింక నే
నడుగటు పెట్టనీను? ధనమంతయు నిక్కడఁ గ్రక్కఁగావలెన్. 11

(అని త్రోవకడ్డమువచ్చి మొలలో చేయి వేసి నిలుపుచున్నాఁడు.)

హరి—మహాత్మా! నీవుచెప్పినట్లు బ్రాహ్మణ వృత్తి చేతను వైశ్యవృత్తి చేతను ధనమార్జించుట నాచేతఁగాదు. నారాజ్యము సర్వమును మీగురువుగారికి ధారపోసి రాజవృత్తినీవలనే విడిచి యున్నాను. ధనార్జనమున కిఁక నాకొక్క సేవకవృత్తి మాత్రమే కనఁబడుచున్నది. పట్టువిడిచి నాలుగడుగులు సాగనిమ్ము. ఏమహానుభావుని యొద్దనైనను గొలువు కుదిరి నీఋణము తీర్చివేసెదను.

నక్ష—నేనట్లుపోనియ్యను. నెలదినములనుండి నిన్ను మంచి మాటలతో నడుగుచుండినఁ గార్యము లేకపోయినది. నిష్ఠురవృత్తి చూపి నిన్నాయాస పెట్టినంగాని నీవు ధనమియ్యవు. నెలదినముల నుండి నీమూలమున నా స్నానసంధ్యాద్యనుష్ఠానము మంటఁగలిసి పోయినవి. ఇంతకాల మోపిక పట్టినను నేను నీ కేమయిన మంచి వాఁడనయితినా? ఆవలమాగురువుగారి యాగ్రహమునకుఁ గూడ నే నేల పాత్రుఁడను గావలెను? ధన మిప్పుడు నా ముందు పెట్టి మఱిమాటలాడుము.

హరి—ఓమహాత్మా! నన్నేల నిర్హేతుకముగా నడివీధిలో సిగ్గుపఱిచెదవు? ధనసంపాదనమునిమిత్తము నేను పడుచున్నపాట్లను నీవు కన్నులారఁ జూచుచునేయున్నావుగదా! ధన మెవ్వరినైనను వేఁడుట కయినను ముందు సాగనిమ్ము.

నక్ష — కార్యములు కావలెను గాని నీ తియ్యమాటలు నాకక్కఱలేదు. ముందుగా నీయొద్దనున్న సొత్తును విక్రయించి కూడినంత ధనము నాచేతఁబెట్టి మిగిలినదాని నిమిత్తము యేసేవకవృత్తియందో ప్రవేశింపుము.

హరి — ఓనటువర్యా! కట్టుబట్టలతో లేచి వచ్చిన మావద్ద నీవెలుఁగని సొత్తేమున్నది?

నక్ష — నీభార్యాపుత్రులు నీసొత్తు కారా? వారిని విక్రయించి వచ్చినసొమ్ము నాచేతిలోఁ బోయుము.

హరి — హరహరా! ఎంతపాపపుమాట వినుచున్నాను!

(అని తలవంచుకొని దీనత్వముతోఁ గ్రిందు చూచుచున్నాఁడు)

చంద్ర — ఓ ప్రాణేశ్వరా! మీరీప్రకారముగాఁ జింతాక్రాంతులయి ధైర్యమును విడుచుచున్నారేమి? ఈ మునికుమారుఁడు చెప్పినయుపాయము చక్కఁగా నున్నది. ధర్మము చెడిపోవునప్పుడే భర్తకు సాయపడదేని, ఆ భార్యయెందుకు? మనఃపూర్తిగా నేనే మిమ్ము వేఁడుచున్నాను గనుక మీకు భార్యావిక్రయపాతక మణుమాత్రమును రాదు. మీరాలస్యము చేయక నన్ను దాసినిగా విక్రయించి వచ్చినధనముతో మీ ఋణముతీర్చి మిమ్ముఁబొంకింపఁ గంకణము కట్టుకొన్న విశ్వామిత్రుని ప్రతిజ్ఞ బొంకు చేయుఁడు.

హరి — ఓ హృదయేశ్వరీ! నీమాటలు నా హృదయమునను బాణములకంటెనుఁ దీక్షణముగా నాటుకొనుచున్నవి. ఈ దుస్సహ పరుషవాక్యాగ్ని శిఖలను నామనస్సునందుఁ జొనిపి యేల బాధ పెట్టెదవు?

క. ఒక్కట నీవాగ్వహ్నియుఁ
జిక్కక చిత్తముఁ దపింపఁ జేసెడు నింతే
గ్రక్కున దహింపఁ జేయుఁగ
నక్కటకట చేతఁగాని దయ్యెను నిదియున్.

క. ఇలలో నెందయినను దన
కులకాంతను విక్రయించుకూళయుఁ గలఁడే!
పలుకను దలఁపను గూడని
కొలయేటికిఁ గట్టెదీవు కొమ్మరొ నాకున్ !
(అని కన్నీడు విడుచుచున్నాఁడు.)

చంద్రి—ఓ ప్రాణనాథా! దుఃఖింపఁబోకుము. విధియిప్పుడు మనకిద్దఱకును వియోగము కలుగవలయునని విధించినాఁడు. ప్రతిబంధము చెప్పక దేవర నాప్రార్థన మంగీకరింపవలయును. భార్యారక్షణముఁ ధర్మరక్షణమునకంటె నధికమయినది కాదు. మరణానంతరము ధర్మమొక్కటియె సఖునివలె నెంటవచ్చి సుఖపెట్టునుగాని బ్రతికినన్నాళ్లును దెమ్మని తినితిని యనుభవించెడి యీ భార్యలును బంధువులును దా మొక్కఁడును వెంటరారు. మృత్యువెప్పుడు వచ్చునో మనతోఁ జెప్పిరాదు. కాఁబట్టి భార్యపోయినను బిడ్డలుపోయినను లోకములోనిదిమఱియేదిపోయినను బుద్ధిమంతుఁడు ధర్మముతప్పక శాశ్వతానందము కలుగుమార్గమునుజూచుకొనవలెను. కాఁబట్టి మీరు ధర్మరక్షణార్థమయి నన్నుఁ ద్యజింపవలయును.

హరి—ఓ ప్రాణేశ్వరీ! అప్పుతీర్పలేని దుఃఖాగ్నిచేత నే తాపమొందుచున్న నాడెందమును నీదుస్సహవాక్యాగ్నిచేత మఱింతతపింపఁజేయకుము. సత్యవర్ణనమెంత ధర్మవిరుద్ధమో ధర్మపత్నీ విక్రయమును బురుషున కంత ధర్మవిరుద్ధమే. ధర్మబాహ్యమయిన నీ ప్రార్థనకు నే నెట్లొడంబడనేర్తును?

చంద్ర—ఓ ప్రాణేశ్వరా! మీఁచింతమాని నామనవిసాంతముగాఁ జిత్తగింపుఁడు. ఆపత్కాలమునందు దనదేహము నయిన విడిచి భర్తనుద్ధరించుట కులసతికి ధర్మము. అంతేకాక వివాహవిధిచేత భార్య భర్తసొత్తనుట లోకప్రసిద్ధముగదా ! ఆపన్నివారణము

నకయి యట్టిసొత్తునన్యులకు విక్రయించుటచేఁ బాపమేమున్నది? అదిగాక నేను మనఃపూర్వకముగా నన్యులకు దాసినయి మిమ్ము ఋణవిముక్తులను జేయుటకయి యొప్పుకొనుచున్నాను. మీరు సంకోచింపక ప్రేమానుబంధము గోసివేసి నన్ను దాసినిగా నమ్మివేసి యీ ఋణబాధను దప్పించుకొని శక్తియున్నప్పుడు నన్ను మరలమీ ధనముగాఁ జేసికొనుఁడు. మీరంగీకరింపకపోయినను నాకు దాస్యము తప్పదు. పూర్వము దుర్వాసుఁడొకసారి నన్ను మూఁడుమాసములు దాసినిగా నుండ శపించినాఁడు.

హరి—అయ్యో? మానులెప్పుడును దయావిహీనులుగదా? నీ వేమియపరాధము చేసితివని నీకతఁడట్టి ఘోరశాపమిచ్చెను?

చంద్ర—నా చిన్నతనములో నే నొకనాఁడు వాకిటనిలుచుండఁగా నొకకిరాతుఁడొక చిలుకపిల్ల నాదారిని గొనిపోవుచు నాకమ్మఁ జూపెను. ఆకీరపోతము మిక్కిలి మనోహరముగా నున్నందున నేను దానిని ముచ్చటపడి కొని ప్రతిదినమును పండ్లును బంచదారయుఁ బెట్టి పద్యములు చెప్పుచుఁ బ్రాణతుల్యముగాఁ బెంచుకొనుచుంటిని. ఇట్లు మూఁడుమాసములు చెల్లిన తరువాత నొకనాఁడాకస్మికముగా దుర్వాసుఁడు మాతండ్రిని జూడవచ్చి నాచేతనున్న చిలుకను జూచి యిదియెక్కడదని యడిగెను.

హరి—ఋషు లెక్కడకుఁ బోయినను జోలిమాలినప్రశ్నలడుగుదురు. అటుతరువాత—

చంద్ర—ఒకనాఁ డొకకిరాతుఁ డీచిలుకను మాయింటి మార్గమునఁ గొనిపోవుచుండఁగా నాపుత్రికయైన యీచిన్నది మక్కువపడి కొని వినోదార్థముగాఁ బెంచుకొనుచున్నదని చెప్పఁగానే యతఁడు మండిపడి—అతనిరూపము తలఁచుకొన్న నాకిప్పుడు భయమగుచున్నది. (అని భయము నభినయించుచున్నది.)

హరి—ఓహో! ఈమూర్ఖముని కోపముచేత విశ్వామిత్రుని గూడ మించిపోయినాఁడే! ఇంతమాత్రము కోపమాపుకోలేని యాతనితపమెందుకు? అడవులలోనుండియు నాగ్రహగుణము విడువ లేని తపస్సులకంటె శాంతులయి యింట నుండు గృహస్థులే యుత్తములు.

ఉ. కానలనుంట నిష్ఫలముగాఁ జను నింద్రియనిగ్రహంబు లే
దేని; మనుష్యుఁ డింట వసియించియు నింద్రియనిగ్రహంబొగిన్
దానొనరించు నేని, సతతంబును సత్ఫలమొందు; శాంతుఁడౌ
మానవుఁ డెందు నున్న నినుమా యదె యాశ్రమరాజమౌఁజుమీ.

అటుపయి నేమిజరిగినది ?

చంద్ర—(గద్గదస్వరముతో) ఆతఁడు మండిపడి. కటము లదర, ముకుపుటములు చెదర నాపంకఁ గన్నులనిప్పులొలుకఁజూచుచు మాయాశ్రమవృక్షమునుండి కిరాతుఁ డపహరించి తెచ్చిన శుక పోతమును బంజరబంధము కావించి బాధించితివి గావున నీవును దాసివై సేవాబంధ మనుభవింపుమని ఘోరశాపమిచ్చి చివాలున లేచెను.

హరి—ఏమి యీ తాపసుని మండగము! ఎఱుఁగక చిలుకను గొన్నసీది మహాపరాధ మని యెంచి నిర్దోషురాలి నూరక శపించుట దోషముగా నెంచకున్నాఁడు!

క. తెలియఁగఁజాలఁడు మనుజుఁడు
తలఁపఁగ గిరులంతలైనఁ దనదోషములన్;
తిలకించుఁ బరులతప్పుల
నలుకఁగ సన్నావగింజ లంతటివానిన్. 15

ఓహృదయేశ్వరీ! నీశాపమున కా మునీశ్వరుఁడు మాసత్రయావధి పెట్టనే లేదా?

చంద్ర— మొదటమితిపెట్టలేదు. అప్పుడు నాజనకుఁడాతని పాదములమీఁదఁబడి, ఓమునితల్లజా! బాల్యచాపలముచేత నెఱుఁగక చేసిన యీమె నేరమును క్షమింపవేయని బహువిధముల మనసు కరఁగఁ బ్రార్థించెను. అంతట నామునితల్లజుఁడు కొంతప్రసన్న హృదయుఁడయి మూఁడు నెల, లీచిలుకకు స్వేచ్ఛావిహారభంగము గలిగించినది గనుక, ఈమెదాస్యమును మూఁడుమాసములే యుండు నని యనుగ్రహించి కొలువువిడిచి వెడలిపోయెను.

హరి— ఈయుపకారమున కాతనికి మన మనేకాభివందనములు చేయవలసినదే. ఇది యెఱిఁగియే కాఁబోలును మన కులగురువులైన వశిష్ఠులవారు మనవివాహకాలమునందు నీకు దాసీయోగ మున్నదని నాతో సెలవిచ్చినారు. నీమీఁదఁగల ప్రేమచేత నాకామాటలప్పుడు చెవిని నాటినవి కావు.

చంద్ర— ఈసంగతి నేను నేఁడు క్రొత్తగా దేవరవారితో విన్నవించుటకాక యీవఱకే వశిష్ఠులవారు సెలవిచ్చి యున్నారు గదా? మీరిఁక సందేహముమాని నన్నెవ్వరికైన విక్రయింపుఁడు. ఇందువలన నమోఘమయిన బ్రాహ్మణశాపహతిచేత నాకవశ్య భోక్తవ్యమయియున్న దాస్యమునుం దీఱును; మీఋణమునుదీఱును.

హరి— ఓప్రాణేశ్వరీ! పుష్పకోమలివైన నిన్నిట్లు కాఱడవులలోఁ గష్టపెట్ట సంశయింపని కఠినచిత్తుఁ డెట్టిదారుణకర్మమున కయినను లోఁబడును. నామూలమునఁగదా,

చ. చెలువపుహేమసౌధముల స్నిగ్ధశశాంకశిలాతలంబులన్
మెలఁగెడునీవు ఘోరవనమేదినిలోపల సూదిరాళ్ళలో
నడుగులు పొక్కఁ గంటకచయంబులు గ్రుచ్చుకొన న్మెలంగుచుం
బలుమఱు నిట్టిపాట్లుపడఁ జాలితి వక్కట మిక్కుటంబుగన్. 16

క. పరిచారికాశతంబులు
పరిచర్యలు చేయ సతుల వైభవలీలన్

జరియించెడు నీవిపు డే
కరణిం బరిచర్య చేయఁ గల వన్యులకున్? 17

క. ప్రాణములు నిల్పఁ గలనే
యేణాక్షిరో నిన్నుఁ బాసి యేనిమిషంబున్ ?
రాణీ! నినువిడిచిన నా
ప్రాణంబులు క్షణములోనఁ బాయును బొందిన్. 18

ఉ. ఈవు సమీపమందు వసించుట నాకునిశల్ పగళ్ళగున్,
బూవులతోఁట లౌను వనముల్, గిరిగహ్వరముల్ గృహంబులౌ,
గేవలజీర్ణపర్ణములు గెంజిగు రాకులమేలిపాన్పులౌ;
హా! వనజాస్య! తాళఁగలనా నినుఁబాసి నిమేష మేనియున్? 19

నక్ష—ఓరాజా! నీకీయాఁడుదాని కున్నంతవివేకమయినను లేదు. పెట్టిన మితిలోపల ఋణ మేలాగునైనఁ దీర్పవలెనని యీమె సదుపాయము చెప్పుచుండఁగా నీ వీమెమాటలను బెడచెవులఁబెట్టి కల్లయేడ్పు లేడ్చుచు భార్యమీఁద మహాప్రేమ యున్నవానివలె నటించి మాయప్పెగవేయఁ జూచుచున్నావు. నక్షత్రకుని ముందఱ నీ యాటలు సాగిరావు. నాకు నీకంటెను మాయలెక్కువ తెలియును. ఈబుడిబుడి యేడుపులుచూచి జాలిపడి విడిచిపోవుటకు నేను మఱియెవ్వఁడను గాను; కరుణయున్న నేమో యెఱుఁగని విశ్వామిత్ర శిష్యుఁడను జుమా. రమ్ము. పోయినంతవట్టుకు నీభార్యనమ్మి వచ్చిన సొమ్ము నాచేతికిమ్ము. (అని లాగుచున్నాఁడు.)

చంద్ర—ఓ ప్రాణేశ్వరా! ఈతనిచేత నీడుపులు పడక విధికృతమయిన నా దాసీత్వమునకు మీరును సహకారులు కండు.

హరి—(గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు) భార్యావిక్రయము చేయు పాతకికి కమ్మని విధి నానొసట వ్రాసియుండఁగా నేనెట్లుసహకారుఁడను గాకుందును? ఓ భూసురోత్తమా! నీ యభిమతమే చెల్లనిమ్ము.
(అని వెంటనడచుచున్నాఁడు.)

[అప్పుడు కొందఱు పౌరులు ప్రవేశించుచున్నారు.]

నక్ష—ఓపురజనులారా! ఈతఁడు తనభార్యయైన యీ సుందరి నమ్మఁబోవుచున్నాఁడు. మీలో నెవ్వరికైనను దాసి కావలసినయెడలఁ దగిన రొక్కమిచ్చి కొనుఁడు.

హరి—ఓహో? ఈదారుణవాక్యము పిడుగువలెఁ గర్ణరంధ్రములఁ దూఱియు నాకఠినహృదయమును పగిలింపఁజాలకున్నది. నాహృదయము వజ్రముతోనో యినుముతోనో చేయఁబడినది.

ప్రథమపౌరుఁడు—ఓనరోత్తమా? నీకీ త్రిలోకసుందరి యయినభార్యను విక్రయింపవలసినంత దురవస్థ యేలపట్టినది?

ద్వితీయపౌరుఁడు—హరహరా? ఇటువంటి కులకాంతను విక్రయింప నెంతటి బుద్ధిహీనుని కయినను మనసుకొలుపునా? ఓ పుణ్యాత్మా? నీవు నిజముగానే కులాంగనా విక్రయపుణ్యమున కొడిఁగట్టుకొనఁ బూనినావా?

హరి—(కన్నుల నీరునించుచు నూరకున్నాఁడు.)

నక్ష—ఓరాజా? నీవు బేరమడుగువారిప్రశ్నల కుత్తరమియ్యక కార్యము చెడఁగొట్టుచున్నావు. ఈలాగున మౌనము ధరించివచ్చెడు బేర మెల్లను చెడఁగొట్టుటకంటె మీ యప్పుపహరించెదనని మూఁగతనము విడిచి స్పష్టముగానే చెప్పుము. ఈ యడియాస మాని నేను మాగురువునొద్దకుఁ బోయెదను.

హరి—(గద్గదస్వరముతో) ఓ మునికుమారా? వేగిరపడఁబోకు. లోకవిరుద్ధమైన యీవార్త చాటుటకొకపట్టున నానోటమాట రాకున్నది. కొంచెము తాళుము.

నక్ష—అప్పుపహరింపఁ దలచుకొన్న నీకుఁ దాళిక యుండును గాని సొమ్ముగోలుపోయిననేనెట్లు వేగిరపడకుండఁగలను? ఓపౌరజనులారా! ఈతనికి మీతో మాటాడ నోరురాకున్నదఁట! నేను జెప్పె

దను వినుఁడు. ఈతఁడు సూర్యవంశ జలధిచంద్రుఁడగు హరిశ్చంద్రుఁడు? ఇతఁడు మునికుల పవిత్రుఁడైన విశ్వామిత్రునకుఁ దన రాజ్యమంతయు దానమిచ్చి యావలను యజ్ఞార్థ మిచ్చెదనన్న ధనమియ్యలేక ఋణబాధ తప్పించుకొనుటకయి యాలినమ్మ జూపుచున్నాఁడు.

ప్రథమపౌరుఁడు—శివశివా! ఈ మాటలు విన్న పాపము వచ్చును. మనము పోదము రండు. మన మెక్కడ? మహారాజు భార్యను కొను టెక్కడ?

ద్వితీయపౌరుఁడు—ఈతఁడు తనరాజ్యమంతయు విశ్వామిత్రునకా ధారపోసినది? రాజ్యమంతయుఁ దనకు ధారపోసిన మహాదాతను మున్నిచ్చెదనన్న స్వల్పధనము నిమిత్తమయి యిటు తనముల్లె దాఁచఁబెట్టినట్లు బాధ పెట్టుచుండుటచేత నతఁడు విశ్వామిత్రుఁడనదగిన వాఁడే! తనవంటి పాత్రుని వెదకి దానమిచ్చిన యీ సాధుచరిత్రుని చిక్కులు పెట్టెడియతఁడు విశ్వమున కమిత్రుఁడు గాక మిత్రుఁ డెట్లగును?

ప్రథమపౌరుఁడు—ఎవ్వరును లేనట్టు పరమకోపి యని పేరు పొందిన యాకౌశికుని కేల దాన మిచ్చితివి? ఇచ్చినను దగుమాత్రపు దానము చేయవలెనుగాని శక్తికి మించినదానము చేయ వచ్చునా?

ఉ. కొందఱు యాచకాధముల క్రూరముఖస్థితి కుబ్బియావిచే
ముందట నేమొ ముక్తి తముఁ బొందెదుర౯ భ్రమ దాతలంచుఁ బే
రందఁగ నాలుబిడ్డల గృహంబున సంగడఁ బెట్టి దానముల్
క్రందుగఁ జేయుచుండుదురు కారెకిరాతకు లట్టివారిల౯? 20

ద్వితీయపౌరుఁడు—ఇందులో రాజు ననవలసిన దేమున్నది! మన బ్రాహ్మణోత్తములే యంతకయినను దగినవారు. వారు సమయము వేచి తమ కుపకారము చేసినవారికే యపకారము చేయుదురు. (అని పోవుచున్నారు.)

నక్ష—ఓరాజా! అమ్మవలసినవాఁడవు నీవు నోరెత్తకపోవుట చేత కొనఁదలఁచివచ్చిన వీరందఱును తొలఁగిపోవుచున్నారు. నీమౌనము చూచి నీవేమో ముగ్ధుడవనిభావించి మీఁదుమిక్కిలి వీరు మాగురువుమీఁదనే తప్పుమోపి దూషించుచున్నారు. పరమపవిత్రుఁడయిన యావిశ్వామిత్రునిఁ వీరిచేత నిట్లు తిట్టించుట నీకుధర్మమా? నీవిప్పు డాలి నమ్మ నని తెగఁజెప్పుము. నీవసత్యవాది వని యెఱిఁగి, నాదారిని నేను బోయెదను.

హరి—ఓఋషికుమారా! నిష్ఠురము లాడకు. నేనిదిగో చంద్రమతిని విక్రయించుచున్నాను. (పురజనుల నుద్దేశించి)

గీ. పౌరులార! సుస్థిరమహోదారులార!
మునిఋణముదీర్ప నాభార్యఁ బుణ్యధుర్య
దాసిఁగా విక్రయించెద దయ దలిర్ప
వేగఁ గొనరయ్య నేఁ గోరువిత్తమిచ్చి. 21

సీ. కలలోననైన నవ్వులకైన నిసుమంత
బొంకి యెఱుంగని పుణ్యశీల
తప్పఁ జేసిననైనఁ దన్ను దూఱిననైనఁ
గోపించి యెఱుఁగనిగుణధురీణ
పెఱలను దనవారి వేఱుగాఁ జూడక
నారయునట్టిసదయహృదయ
కానిమాటలు తన్నుఁగలుషాత్మ లాడినఁ
గలహింపనొల్లని గరితమిన్న

గీ. పరులసొమ్ము తృణంబుగ భావమందుఁ
దలఁచి యెప్పుడు వర్తించుధన్యచరిత
చంద్రమతి నాదుభార్య యీసాధ్వి మణిని
విక్రయించెదఁ గొనరయ్య విబుధులార! 22

[అప్పుడు వికృతవేషముతో కాలకౌశికుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

నక్ష—ఓరాజేంద్రా! నీవందఱికిని వినఁబడునట్లు బిగ్గరగాఁ జాటకున్నావు. అందుచేతఁ బౌరు లిటురాక దూరదూరముల బోవుచున్నారు. ధాన్యవుమూటలును జంపిబట్టలును బంచాంగవుఁగట్టయును ధరించి యొక బీదబ్రాహ్మణుఁడుమాత్ర మీవంక వచ్చుచున్నాఁడు.

కాల—(ప్రవేశించి) అయ్యా? మీరు గుంపుకూడి యేమి చేయుచున్నారు?

నక్ష—ఈసుందరిని దాసినిగా విక్రయించుచున్నాము.

కాల—ఓకాంతా! నీ వేమిపనులు చేసెదవు?

చంద్ర—రెండుపనులు తక్కఁ దక్కిన పనులన్నియు నేను జేసెదను.

కాల—ఆరెండుపనులు నేవి? నీవు భోజనము చేసెదవుగదా?

చంద్ర—నేను బరోచ్ఛిష్టభోజనము చేయను.

కాల—అట్లయినఁ గొనువారి కందువలన లాభ మేదియు లేదు. ఇఁక నీవుచేయని రెండవపని యేది?

చంద్ర—పరపురుష—(అని చెప్పుటకు సిగ్గుపడుచున్నది.)

కాల—నీవు చెప్పనక్కఱలేదు. నాకది బోధపడినది. మంచిది యిప్పుడు నీభర్త యెక్కడ నున్నాఁడు?

హరి—ఇదిగో జీవచ్ఛవము నయి యిక్కడనే నిలుచున్నాను

కాల—నీ వెవఁడవు?

హరి—నేనవార్యశౌర్యధుర్యుఁడయిన త్రిశంకుని తనూజుఁడను; సూర్యవంశ—

కాల—నీవు చెప్పనక్కఱలేదు. నీవృత్తాంతము నేనీవఱకే యెఱుఁగుదును. సామ్రాజ్య మంతయు గాధిపుత్త్రుఁ డయినవిశ్వా

మిత్రునకు ధారపోసి యాతని కింకరుమన్న యర్ధార్ధ మిచ్చెద నన్నవిత్త మియ్యలేక చిక్కులు పడుచున్న హరిశ్చంద్రుఁడవా నీవు!

హరి—అవును. ఆ విత్తమునిమిత్తమే యిప్పు డీయిల్లాలిని విక్రయింపఁబోవుచున్నాను.

కాల—సరిసరి! సర్వమును దెలిసినది. ఇంతేకదా? ఆఋణ బాధ తప్పించుకొనుటకయి నేను నీ కిప్పు డొక్కయాలోచన చెప్పె దను వినుము. సుందరీమతల్లియయిన యీయిల్లాలిని పరుల కమ్మ నేల? నిష్కారణముగా నిందపాలు కానేల? నీవియ్యవలసినయర్ధ మీబ్రహ్మచారిచేతి కిచ్చితినని యొక్కబొంకుబొంకుము. స్త్రీల విషయమునయి బొంకుట దోషము కాదుకనుక నీకు నేను సాక్షిగా నుండెదను. ఇప్పుడీతని చేతిలోనుండి తప్పించుకొని పోఁగలిగినయెడల, నీకసత్యమావల బాణమయినాటుకొనదు. నాబుద్ధి విని యీయొక్క యసత్యము పలుకుము. అసత్యభయము నీమనస్సును బాధించెడు పక్షమున, నాకల్పదక్షిణ యిచ్చితివా పాపపరిహారార్థముగాఁ దగిన ప్రాయశ్చిత్తము చేయించి నీయసత్యదోషము తొలఁగించెదను.

హరి—అసత్య మొక్కటియే యయినను నరుని నరక గామిని జేయకమానదు.

గీ. చిన్నసూది బెజ్జంబంతచిల్లి యున్నఁ
గడవెఁడుజలంబుఁ గ్రమముగాఁ గాఱునట్లె
పాపమున కింత యెడ సందు వదలునెడల
సర్వపుణ్యముల్ క్రమముగా సమసిపోవు. 23

కాఁబట్టి బుద్ధిమంతుఁ డెన్నఁడును బాపహేతువయిన యసత్యమునకుఁ దనహృదయము నందుఃఖమాత్రమును జోటియ్యఁ గూడదు. వేయిప్రాయశ్చిత్తములు చేసికొన్నను, అసత్యదోషము పోదు.

కాల—నీవు వట్టిబుద్ధిహీనుఁడవు. ఋణవిముక్తుఁడ వగుటకు దగినసదుపాయమును నేనుపదేశించుచున్నను గ్రహింపజాలకున్నావు. లోకములో నసత్యముబాడి బాగుపడి సంపదలతోఁ దులఁదూఁగుచున్న వారిని నీవు చూచుచుండలేదా? ఈలోకములోఁ గల్ల లాడుటవలన గౌరవహాని యెంతమాత్రమును రాదు.

హరి—ఓవిప్రోత్తమా! నీయభిప్రాయముతో నే నేకీభవింప జాలను. నీతిమార్గననడుచువా రొకవేళ దైవవశమునఁ గష్టముల పాలయి యుడుఁగినను వారికిగౌరవమేనచ్చును; నీతిమాలినవా రొకా నొకప్పుడు సుఖ మనుభవించుచున్నను వారికి గొప్పతనము రాదు. తాత్కాలికసుఖ మొకసుఖము కాదు. మన మెప్పుడును ధనము పోయినప్పుడును ముసలితనము వచ్చినప్పుడునుకూడ లోపల నంతె రాత్మ పోరులేక సుఖపడునట్లుగా నడుచుకోవలెను. ఆసుఖము నీతి మార్గముచేతఁ దప్ప మఱి దేనిచేతను లభింపదు. నీవు చెప్పినగౌరవ మయినను సత్య వేషమును వేసికొని వచ్చినప్పుడే యసత్యమునకుఁ గొంత కాలము కలుగును గాని నిజస్వరూపముతో వచ్చినప్పు డెప్పు డును గలుగదు.

గీ. ధాత్రిలో గౌరవము పొందఁ దలఁచునేని;
ధర్మవేషంబె వేయు నధర్మ మెపుడు;
స్వస్వరూప మొక్కించుక బయలఁబడిన;
నడుచు నాగౌరవం బెల్ల నాటితోనె. 2.

ఓబ్రాహ్మణోత్తమా! నాకిప్పుడు నీతో వాదమున కవకాశములేదు. ఇఁక బహుభాషలుమాని నీకుఁ గావలసెనా నేను గోరినవిత్తమిచ్చి యీసాధ్విని బానిసనుగాఁ గొనుము. అక్కఱ లేనియెడల మాపని చెడఁగొట్టక నీదారిని నీవు పొమ్ము.

కాల— నీబాగుకొఱకే నేనిప్పుడు నీకుహితము చెప్పితిని గాని నా మేలుకొఱకుఁగాదు. నీభార్యను విక్రయించుటకు నీకే చింత

లేకపోయినపక్షమున. మాకుమాత్ర మేమిటికి? ఈమె యోగ్యురాలని చెప్పుచున్నావు గనుక నీవీమె కెంతధనము కావలెనందువో కోరుము. ఇప్పుడ నే నారొక్క మిచ్చి కొనెదను.

హరి—ఏనుఁగుమీఁద నెక్కి నిలుచుండి రత్న మెగమీటి నంతయెత్తుధనమిచ్చినజాలును. దానితో నాకిప్పుడు ఋణవిమోచన మగును. నేను మరల నీధనమును నీకు వడ్డితో నిచ్చి వేసినప్పుడు మరల నాభార్యను దాస్యమునుండి విముక్తురాలినిగాఁ జేయవలెనుజుమా.

కాల—అందుకు నేనొప్పుకొన్నాను. ఆయెనుటి దే మాయిల్లు నాతోవచ్చినయెడల విత్త మీభూసురోత్తమున కిచ్చెదను.

హరి—నక్షత్రకా! నీ వాధన మప్పగించుకొమ్ము.

నక్ష—ఓబ్రాహ్మణోత్తమా! ఇఁక నీవు నీబానిసయైన యీ చంద్రమతిని నీవెంటఁ గొనిపోవచ్చును.

కాల—హరిశ్చంద్రా! కొనిపోవచ్చునా?

హరి—(డగ్గుత్తికతో)కొనిపోవచ్చును. (అని కన్నులనీరు పెట్టుకొనుచున్నాఁడు)

చంద్ర—(కన్నుల నీరు నించుచు) ఓప్రాణేశ్వరా! నానిమిత్తమయి మీరడలఁ బోకుఁడు. నాశరీరము దూరముగా నున్నను, నాహృదయ మెప్పుడును మీయొద్దనే యుండును.

హరి—నాబహిఃప్రాణమా! నిన్నుఁబాసి నే నెట్లు తాళఁగలను? జీవములనుబాసి బొంది యెప్పుడైనఁ దల యెత్తఁగలుగునా! ఇఁక నా కెక్కడిబ్రదుకు? ఎక్కడిసుఖము?

గీ. అఖిలసామ్రాజ్యసంపద లనుభవించి
వైభవసమగ్రుఁ డగుసార్వభౌమునకును
దేవివై యుండి యొక్కని కీవు నేఁడు
దాసివైతివె కటకటా దైవగతిని. (అని యేడ్చుచున్నాఁడు.)

కాల—ఓరాజేంద్రా! నేను క్రొత్తగా దాసిని గొన్నవు డమంగళకరముగా నీవేల యేడ్చెదవు? ఈశోకము మాని నీహృదయము పదిలపఱచుకొమ్ము. నీలోపలనున్న పంచేంద్రియములలో నొక్కదానిని జయింపలేనివాఁడవు లోకముల నెట్లుజయింపఁగలిగితివి?

హరి—అనుభవించువారు తాము కానప్పుడు పయినుండి పరుల కెన్నినీతులనైనను బోధింపవచ్చును గాని తమకే యాపదలు వచ్చినప్పు డెంతటిపండితులును ఖేదము నొందకుండజాలరు. ఎంతటి వేదాంతియైనను దేలుకుట్టినప్పు డేడువకుండునా?

కాల—అట్లయినపక్షమునఁ బైత్యవునీరు కాఱిపోవునట్లుగా నీవు కావలసినంతసే పేడువుము. మాదాసిని దీసికొని మాయింటికి నేనుబోయెదను. ఓచంద్రమతీ! ఈమాటలను మోచుకొని నావెంట మాయింటికి రమ్ము ఏమి? కదలవేమి? (అని మూటలు మీఁద వేయుచున్నాఁడు)

చంద్ర—క్షణము తాళుము. నాభర్తముఖ మింకొక్కసారి కన్నులారఁ జూడనిమ్ము.

కాల—నీభర్తదెప్పుడును జూచెడుప్రాఁతముఖమే. నడువు నడువు. (అని గెంటుచున్నాఁడు.)

లోహి—ఓబిచ్చపుబ్రాహ్మణుఁడా! బలవంతముగా మాయమ్మ నెక్కడకుఁదీసికొనిపోవుచున్నావు?

చంద్ర—ఓలోహితాస్యా! నీవు మీనాన్నగారియొద్దకుఁ బొమ్ము. నీఋణానుబంధము నాకు నేటితోఁ దీఱినది. (అని కన్నుల నీరు విడుచుచున్నది)

హరి—ఓలోహితాస్యా! ఆలిని విడిచిన పాపాత్ముఁడను నా యొద్ద కేలవచ్చెదవు? నీతల్లి వెంటనే పొమ్ము.

కాల—ఓబాలకా! నీతల్లి వెంబడినే రమ్ము. నీవును నేను కొన్నవిలువలోనివాఁడవే.

హరి—ఇది యేమిన్యాయము? నాభార్యను నీకమ్ముఁజూపి నప్పుడు నే నీబాలకునిఁ జెప్పలేదే. వేఱుగ వెలయిచ్చి వీనినిగూడఁ గొని తల్లిబిడ్డల నేకము చేయుము.

కాల—నీ వీనుందరిని నాకమ్మినప్పు డీబాలుఁడు జట్టిలోని వాఁడు కాఁడని నాతోఁ జెప్పలేదు. అవును గొన్నప్పుడు లేగ దానితో రాదా? అట్లేయీ బాలుడును దల్లిని గొన్న నాసొత్తె యగును.

నక్ష—ఈవిషయమయి మీరిరువురును బరస్పరవివాదమేల పడియెదరు? మాగురుప్రసాదముచేత నేను ధర్మశాస్త్రము లనేకము లెఱిఁగినవాఁడను. నన్ను మధ్యస్థునిగాఁ గోరుకొన్నయెడల మీలో నెవ్వరికి నన్యాయము కలుగకుండ యథావిధిగాఁ దగవు తీర్చెదను.

హరి—నీవు నీయిష్టము వచ్చినట్లు న్యాయము తీర్పుము.

కాల—నేనును నీమధ్యవర్తిత్వమున కొప్పుకొని పుణ్యమును పాపమును నీమీఁదనే వేసెదను.

నక్ష—అట్లయినపక్షమున నాకుఁ దోచినన్యాయమును జెప్పెదను వినుఁడు.

హరి—సావధానుల మయి యున్నాము చెప్పుము.

నక్ష—ఏధర్మశాస్త్రప్రకారముగా నే నిప్పుడీతగవు తీర్పవలెనో సందిగ్ధముగా నున్నది. సందిగ్ధమైన ధర్మశాస్త్రములను మాని నే నిప్పు డభ్యసించుచున్న వ్యాకరణశాస్త్రప్రకారముగా వ్యవహారము తీర్చెదను. వినుఁడు. ఈమె తల్లి! ఇతఁడుపిల్లఁడు. తల్లిలోను పిల్లలోను కారద్వయమున్న సంబంధముచేతఁ దల్లియుఁ బిల్లఁడు నొక్కటే తండ్రిపిల్లల కట్టిసంబంధము లేకపోవుటచే నిద్దఱును వేఱు. కాఁబట్టి తల్లిని గొన్న సంబంధముచేత బిల్లవాఁడును గాలకౌశికుని సొత్తైయయినాఁడు. ఓరాజా! ధర్మాధికారినైన నాతీర్పు

నకు బద్ధుఁడ వయి మాఱుమాటాడక లోహితాస్యు నీతని కిచ్చివేయుము.

హరి—అయ్యా! వ్యవహారనిర్ణయమునకు ధర్మశాస్త్రములు ప్రమాణముకాని శబ్దశాస్త్రము కాదు.

నక్ష—నేను జెప్పినదే ధర్మశాస్త్రము ఋషులవాక్యము లే ధర్మశాస్త్రములు. నేనును ఋషికుమారుఁడనే కాఁబట్టి జెప్పినది పిల్లధర్మశాస్త్రము. ఈపిల్లధర్మశాస్త్రమునుబట్టి యీపిల్లవానిని నీతని గొనిపోనిమ్ము.

కాల—ఓమునికుమారా! నీవు ధర్మశాస్త్రపారంగతుఁడవు. నాపాలిధర్మదేవతవలె వచ్చి న్యాయము చెప్పినావు. నేను నీమేలు మఱచిపోను. (అని కౌఁగిలించుకొనుచున్నాఁడు)

హరి—లోహితాస్యా! నీవు నీతల్లివెంట నీబ్రాహ్మణునితోఁ బొమ్ము.

కాల—ఓచంద్రమతీ! నాకు శివపూజాసమయ మయినది. వేగిరము నడువుము.

చంద్ర—నాప్రాణనాథుని సెల వడిగి రానిండు. ఓప్రాణేశ్వరా! (అని పాదములమీఁదఁ బడుచున్నది)

హరి—ఓప్రాణేశ్వరీ! లెమ్ము. విశ్వనాథుఁడు శీఘ్రముగా నీ దాస్యమును దొలగించి నీకు సుఖ మిచ్చునుగాక! (అని కన్నీరు నించుచున్నాఁడు)

చంద్ర—(లేచి) ఓప్రాణేశా! విధి పాపాత్ముఁడయి యిప్పుడు నాకు నీపాదసేవకూడ లేకుండఁ జేయుచున్నాఁడు. కటకటా! నిన్నెట్లెడఁబాయ నేర్తును?

కాల—నాకావలఁ బ్రొద్దెక్కుచున్నది. నీచదువు చాలించి నడువుము.

చంద్ర—ఇదిగో! వచ్చుచున్నాను. ఇంకొక్క నిమిషము తాళుము—ఓప్రాణేశ్వరా! నీవు నానిమిత్తమయి లేశమును జింతిల్లఁబోకుము. మమ్ము మఱచిపొమ్ము; సత్యమునుమాత్రము మఱవకుము.

కాల—ఓవంచకురాలా! నీవే వేళకును గదలి రాకున్నావు! మాటలసందడిలో నన్నేమఱించి పారిపోవఁ జూచుచున్నావా యేమి! నేను నీమాయలకు మోసపోవువాఁడను గాను. పద పద. (అని లాగుచున్నాఁడు)

చంద్ర—ప్రాణేశ్వరా! పోయి వచ్చెదను. (అని రెండడుగులు నడిచి వెనుక తిరిగి చూచి) నాకు నడువఁ గాళ్ళురాకున్నవి; హృదయము కొట్టుకొనుచున్నది. (అని తిరిగితిరిగి చూచుచు లోహితాస్యునితో మెల్లగ నడుచుచున్నది)

కాల—ఓదాసీ! నీ పెండ్లినడక లిఁకఁ గట్టిపెట్టి వేగిరము నడువుము. (అని నడుచుచున్నాఁడు)

నక్ష—ఓరాజా! బ్రాహ్మణుఁడుపోవుచున్నాఁడు. సొమ్ము తెచ్చకోవలెను. నీవు మొగము వ్రేలవేసికొని నిలువఁబడక నాముందు నడువుము.

హరి—(కన్నీరు నింపుచు) నాపాలిఁటి భాగ్యదేవతా! నా సామ్రాజ్యలక్ష్మీ?

నక్ష—ఏమి నామాట వినిపించుకో వేమి? బ్రాహ్మణుఁడు దాటిపోకుండ శీఘ్రముగా ముందు నడువుము.

హరి—నీతోడ నే నేల రావలెను? నీవు పోయి నీధనము తెచ్చుకొమ్ము.

నక్ష—ఇప్పుడు నీ వొప్పగించునది నాబత్తెపుసొమ్ము. నిన్ను విడిచిపెట్టెడుపక్షమున నిఁక నాగురువుగారిఋణ మెవ్వరు తీర్చెదరు? నాముందర నీవంచనలుమాని శీఘ్రముగా నడువుము.

హరి—ఇది యేమి యన్యాయము ? రెండుసువర్ణములిత్తురు మూఁడుసువర్ణములిత్తురు గాని యింతసొమ్మెవ్వరైన బత్తెమిత్తురా? పకులువిన్న నవ్వుదురు. ఈమాటలు మఱి యెక్కడను బలుకక యీసొమ్ము నీగురువు ఋణముక్రిందఁ గైకొమ్ము.

నక్ష—ఓరాజా! నీవు మాటలచేత నన్ను బెదరించి మోస పుచ్చఁ జూచుచున్నావు, నీమాటలకుజడిసి చేతఁబడినసొమ్ము విడుచు టకు నేనంత తెలివిమాలినవాఁడనుగాను, అల్పసంతుష్టుఁడనుమంచివాఁ డనుగనుక నేనీయల్పధనమునకొప్పుకున్నాను. ఎండవానలకు సహించి వేళపట్టున నన్నము గానక నీవెంట వనములు దూఱి పర్వతము లెక్కి, నదులుదాఁటి, జపతపస్స్వాధ్యాయములుకట్టిపెట్టి పాడు గుళ్ళలోను జెట్లనీడను శయనించి, పడరానిపాట్లుపడియు నిన్నాయాస పెట్టక యూరకున్నాను. నీవు నామంచితనము లేశమయినను గని పెట్టలేకపోయినావు. “అసంతుష్టాద్విజానష్టా” యన్న నీతినిబట్టి దొరికినదానితోనే తృప్తిపొందెడు నన్ను రవ్వచేయక విశ్వామిత్రుని యప్పుకూడా నెట్లయిన నేఁడే చెల్లింపుము.

హరి—నీవు గురువుకార్యార్థమయి కష్టపడితివి గాని నా నిమిత్తము కాదు. పరదేశులకుఁ బాడుగుళ్ళును జెట్లనీడలును గాక పట్టెమంచములును బట్టుపరుపులు దొరకునా? నామాట విని—

నక్ష—నీ విఁక వేయి చెప్పినను నేను నీమాట వినను. నా ప్రాణములైనను విడిచెదనుగాని చేతఁ జిక్కిన యీధనమును మాత్రము నేను విడువను. నాతల నఱికి బ్రహ్మహత్యాపుణ్యము కట్టుకొని మఱి యీధనమును గైకొమ్ము. ఓకాలకౌశికా! నీవు వచ్చి యీయాపత్సమయమున నడ్డుపడి నాప్రాణము నిలుపవలెను.

కాల—(వెనుకకువచ్చి) ఓమునికుమారా! నీ కేమి ప్రాణాంతము వచ్చినది?

నక్ష—ఈరాజు నిన్నన్యాయము చేయదలఁచినట్లే నాబత్తెము నియ్యక నాకన్యాయము చేయఁ జూచుచున్నాఁడు. ఇందులో నీవు నాకు సహాయుఁడవై నీవిచ్చెడుసొమ్ము ముందుగా నాబత్తెముక్రింద నిప్పింపవలయును. నేను మాగురువునిమిత్తము శ్రమపడితిని గాని తననిమిత్తమయి కాదఁట!

కాల—ఓరాజా! న్యాయము తప్పనివాఁడవని పేరుపొందిన నీకిప్పు డీదుర్బుద్ధియేలపుట్టినది? నిన్నాశ్రయించిన యీదారిద్ర్య దేవత యిప్పుడు నిన్నవివేకిని జేయుచున్నదాయేమి? ఇఁక దగవు మాలినపట్టుపట్టక యీవిత్త మీతని బత్తెమునకు విడిచిపెట్టుము. అడవులలోఁ బ్రయాసపడి యింతకాలము నీవెంటఁ దిరుగుట కీతఁడు నీబంటు కాఁడు.

హరి—(తనలో) ఇప్పుడు వీరిద్దఱు నేకమయి యన్యాయమున కొడిగట్టుచున్నారు. వీరిలో నొక్కరును ధర్మపాశములకు బద్ధులగువారు కారు. వృథావాగ్వాదము మాని పుణ్యమును బాపమును వీరిమీఁదనే పెట్టెదను. (ప్రకాశముగా) ఓప్రబుద్ధులారా! మీరిరువురును బ్రాహ్మణోత్తములు. దైవముఖముచూచి మీకు న్యాయమని తోఁచినట్లు విధింపుఁడు. మీ యాజ్ఞకు నేను బద్ధుడనయ్యెదను.

కాల—ఈప్రకారముగా న్యాయమునకు రమ్ము. ఈవిత్త మీతని బత్తెమునకు వదలివేసి యీతని గురుఋణమును నీవు మరలఁ దీర్పవలసినదే.

నక్ష—ఓహో! ఏమి యీన్యాయము! భూలోకములో ధర్మదేవతయే యీబ్రాహ్మణరూపమున నవతరించినది! ఓహరిశ్చంద్రా! నీవింకను మాగురుఋణము తీర్పవలసియేయున్నది. ఆవిత్త మేలాగున సమర్పించెదవో చెప్పు.

హరి—ఓ వ టు శి ఖా మ ణీ! నావద్ద నీ వెలుఁగని విత్తమేమున్నది? దీనిని నీయధీనము చేసికొని నీమనస్సువచ్చినవారికి విక్రయించుకొమ్ము.

నక్ష—మంచిది నావెంట రమ్ము. నేను గోరువిత్తమిచ్చి నిన్ను డెవ్వఁ గులీను డెవ్వఁడును గొనకపోయిన నేనేమిచేయుదును?

హరి—అగ్రవర్ణములవలన నీధనము రాకపోయినయెడల, నీవప్పుడు నన్ను గడజాతి మాలవానికయిన విక్రయించి నీసొమ్ము రాఁబట్టుకొనవచ్చును. నేను చండాలుని కొలువైనను సంతోషపూర్వకముగానే చేసెదను.

నక్ష—ఓసత్యహరిశ్చంద్రా! నీ వన్నమాట తిరుగఁ గూడదు. నావెంట రమ్ము. (అని చేతికి త్రాడుగట్టి వెంటఁ గొని పోవుచున్నాఁడు)

హరి—ఓభూసురోత్తమా! నన్నెక్కడకుఁ గొనిపోయెదవు? ఇక్కడనే విక్రయించు.

నక్ష:—

సీ. ఆడినమాట దానణుమాత్రమును దాట
నట్టిధర్మాత్ముఁ డీయలఘుగుణుఁడు
పృథ్వీతలం బెల్లఁ దృణకల్పముగ దాన
మిచ్చిననెఱదాత యీనృపుండు
బాహులబలిమిసప్తద్వీపములు గెల్చి
యేలినశూరుఁ డీయింద్రనిభుడు
నడిరేయి బేతాళు నడవిలో నెక్కటిఁ
దునిమినవీరుఁ డీఘనభుజుండు
గీ. భూసురేంద్రులార! మహీంద్రచంద్రులార!
వైశ్యవరులార! చరణజప్రవరులార!

విక్రయించెద నేఁ గోరువిత్తమిచ్చి
వీనిఁ గొనరయ్య మీరలు వేగవచ్చి. 26

నేనెంతపిలిచినను బారు లెవ్వరును రాకున్నారు. బదపద. మాలవాఁడకుఁ గొనిపోయి పంచమునకే నిన్ను విక్రయించెదను. (అని లాగుచున్నాఁడు)

హరి—అర్ధప్రాణములు నీయధీనము చేసిన నన్ను నీచిత్తము వచ్చినట్లు చేయుము. (ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

చంద్ర—(తనలో) అయ్యో! నాప్రాణనాథుఁడు దాటిపోవుచున్నాఁడు. అతనిని జూచెడు భాగ్య మీకన్నులకిఁక కలుగునో లేదో.

కాల—ఓకాంతా! అప్పుడు మాయింటికి వచ్చినాము. నా భార్యమిక్కిలి దొడ్డయిల్లాలు. ఆమెయెడల నీవు భయభక్తులు కలిగి నమ్రతతో నడుచుకోవలెను. ఒకానొకప్పు డామె నామీఁద కోపపడి నన్నుఁ గొట్టినను దిట్టినను గూడ నేనుసహితము మాఱుమాటాడక యోర్చుకొని పులినిజూచిన మేఁకపిల్లవలె నొదిగియుందును. తలుపుతీయు మని నాభార్యను బిలిచెదను. ఆమె కోపముఖము చూచి నీవు భయపడఁబోకు. ఆమెరూప మెట్టిదయినను హృదయము మిక్కిలి చల్లనిది—ఓసీ! తలుఁపు తలుపు తలుపు తీయుము.

[అప్పుడు తలుపు తీసికొని కలహకంటకి ప్రవేశించుచున్నది]

చంద్ర—(తనలో) ఓహో! పిల్లికన్నులును జంపితలయును గండుముఖమును గలిగి వికృతరూపముతో నీమె పెనుభూతమువలె నున్నదే! హా దైవమా! నేనెటువంటి రాక్షసికి సేవచేయవలసి వచ్చినది! ఈమె హృదయముకూడ రూపమువలె నుండకపోయినయెడల నేను గొంత ధన్యురాల నయ్యెదను.

కల—(నిమిషము తేఱిపాఱఁజూచి) ఓచండాలుఁడా! పట్టపగలు నిర్భయముగా నీవీజవ్వనిని నాయింటికేల తెచ్చినావురా?

నిమిషమడచిపడకుండ నిలువుము. నీకండ్రక్రొవ్వరిగించెదను. (అని క్రింద నుమియుచున్నది)

కాల—ఓప్రాణేశ్వరీ! కొంతశాంతత వహించి నామాట శాంతముగా వినుము. నే నీముద్దరాలిని.

కల—ఓరి పాపాత్ముఁడా! నీమాటకూడవినవలెనుగా? చచ్చినట్లు పడియుండక నీ వింకను నామాటకు మాఱుమాట చెప్పుచున్నావు? నన్నెవతెనుగాఁ జూచుచున్నావు? నాలుగుదినములనుండి దెబ్బలు లేకపోయినంతమాత్రముచేతనే నేను నీపాలిఁటి యమకాల మృత్యుదేవత నన్నమాట మఱచిపోయినావా? కానిమ్ము. నే నిప్పుడ నీకు బుద్ధివచ్చునట్లు చేసెదను. (అని మగనిమీఁద పడుచున్నది)

చంద్ర—(తనలో) అయ్యో! ఈదంపతు లిప్పుడు ఘోర యుద్ధమునకు డీకొనుచున్నారు. ఈమె కోపావేశముచేతఁ దా నబల యగుట మఱచి పురుషునిమీఁదికే కయ్యమునకుఁ గాలు ద్రివ్వుచున్నది. నేను వారింపఁ బ్రయత్నింతునా?

కాల—ఓప్రాణేశ్వరీ! నీకు మ్రొక్కెదను. నా నేరము మన్నించి నేఁటికి నీదానుని నన్ను విడువుము.

కల—నీవీప్రకారముగాఁ జేసిననేర మొప్పుకొన్నతరువాతఁ గూడ నిన్ను విడిచెద ననుకొన్నావా? నేను గలహకంటకిని గాని మఱి యెవ్వతెనుగాను. బిచ్చపు బ్రాహ్మణుఁడవు నీవెంత? నాపేరు చెప్పిన, ఈవీధినుండు పురుషులందఱును జడిసెదరు.

(అని జుట్టుపట్టుకొనివంచి గుద్దుచున్నది.)

కాల—ఓపుణ్యాత్మురాలా! ఇఁక నే నెప్పుడును నీమాట కెదురాడను. నేను నాతల్లి కేక పుత్రుఁడను. నాయందు దయ లేక పోయినను వృద్ధురా లయిన నాజననినైనను గరుణించి నాకుఁ

ప్రాణదానమును చేసి ముసలిదానికిఁ బుత్రభిక్ష పెట్టుము. పిడుగుల వలెఁ బడుచున్న నీముష్టిఘాతములకు నేను దాళలేను (అని గడ్డము పట్టుకొనుచున్నాఁడు.)

కల—ఓరీ నీచేతులు కాలిపోను! నాదౌడలు నొక్కుచున్నావేమిరా? (అని రెండుచేతులతోను ముఖము బఱుకుచున్నది)

చంద్ర—అమ్మా! నామాటలు విని కోపము శాంతించుకొమ్ము. (తనలో) ఈ సంకుల సమరములో నామాటలే యీమె చెవిసోఁకకున్నవి. మే మాకొండమీఁద మొన్నఁ జూచిన పంచధారలవలెనే గోళ్లు తగిలి యీయన ముఖమునుండి యయిదు నెత్తురుటేరులు పాఱుచున్నవి. ఏమిచేయుదును? నాదేహము కంప మెత్తుచున్నది.

కాల—(తనలో) నాముఖ మంతయు మండుచున్నది. ఈమె నఖములు వజ్రనఖము లయి కామదేవుని పంచాయుధములోయన నా కాయము గాయములు చేయుచున్నవి. కొంచెము సేపు వానివాడిమి వ్యర్థపఱిచెదను. (అని రెండుచేతులును గట్టిగా బట్టుకొనుచున్నాడు)

కల—(గిల్లుటకుఁ జేతఁగాక నిప్పుతొక్కిన కోఁతివలె గంతులు వేయుచు పెద్దపెట్టున నేడ్చుచు) ఓరి పరమచండాలుఁడా! నీ చేతులు పడిపోను! ఓరిపాపీ! నీబలము మండిపోను! తాటిచెట్టులాగున నాఁడుదానిమీఁదఁ బడి యేడిపించెద వేమిరా? (అని మఱింత యేడ్చుచున్నది)

చంద్ర—(సమీపమునకుఁ బోయి) అయ్యా! నా ప్రార్థన విని యీమెచేతులు విడువుము.—అమ్మా! మగనితోఁ గలహించుట పతివ్రతలకు ధర్మముగాదు. ఒకవేళఁ బురుషులయందు దోషమున్నను మనము సహించుకొనిరావలెను. పూర్వమునసూయయు లోపాముద్రయుఁ బతిభక్తిచేతనే కాదా నిరుపమానమైనమహిమ

బొంది సుందరులలో నెల్లను బేరుపొందిరి? భార్యాభర్తలు పరులు నవ్వునట్లుగాఁ గలహములాడక యెప్పుడును క్షీరోదక న్యాయమునఁ గలసి మెలసియుండవలెను.

కాల—ఓచంద్రమతీ! నీవుపదేశించిన నీతి సర్వజనాదరణీయముగా నున్నది. నే నిప్పుడు చేతులు విడిచిపెట్టెదను. నీవెప్పుడును మాయింటనుండి మగనిని గొట్టవలదని సదా యీమె కుపదేశించుచుండుము. (అని చేతులు వదలుచున్నాఁడు.)

కల—ఈమిటారి నిప్పుడు మనయింటికిఁ దెచ్చుటయే కాక సదా యీమెను మనయింట నుంచుటకుఁగూడఁ దలచుకొన్నావురా:- ఓసికుత్సితులారా! నీమాటలకు నాకు సంతోషమగుచున్నది. ఈపతివ్రతాధర్మములు నాకు నీకంటెను బదిరెట్లెక్కువ తెలియును. నీ నీతులింతటితోఁ జాలింపుము. నాకు ధర్మము లుపదేశింపుమని ప్రార్థనచేసి నిన్నిచ్చటి కెవ్వరు పిలుచుకొనివచ్చినారు? నీవు మరొక్పథ చేసినంతమాత్రముచేతనే నీతని నాజ్ఞ పెట్టక మనసు వచ్చినట్లు తిరుగనిచ్చెదననుకొన్నావా ? వేగిరపడకు నామాట కెప్పుడు మాఱుపలుక వెఱచుచుండెడు నాపెనిమిటి భయము పోఁగొట్టి బుద్ధి చెఱుచుచున్న నీపాపఫల మనుభవింతువుగాని నిమిష మోపికపెట్టుము. (అని మగనివంకఁదిరిగి) ఊరిదానిచేత నన్నీరీతిగా గానిమాటలనిపించుటకే యీముత్తురాలిని నాయింటికిఁ దెచ్చినావా? (అని పీడినకొప్పు సవరించుకొని నడుము బిగించుచున్నది.)

కాల—ఓప్రాణేశ్వరీ! ఆగ్రహముమరలఁ దెచ్చుకొకు. నేను నీకుభృత్యుఁడనై యుండెదను. ఈపడుచును బుత్రిసహితముగాఁ నీకు దాసినిగా గొనివచ్చినాను.

కల—(మగనిని కౌఁగిలించుకొని) ఓప్రాణనాథా! ఈమాట మొదటనే చెప్పలేకపోయినావా? అప్పుడే చెప్పియుండినయెడల,

నీముఖముపయి నీబాలచంద్రరేఖలు పడియుండకపోవునే! పోయినది పోనిమ్ము. నేనిఁక శాంతురాలనయ్యెదను. దీర్ఘక్రోధ మెవ్వరికిఁ గూడదు.

కాల—ఓప్రాణేశ్వరీ! నీవప్పుడు నన్ను మాటాడ నిచ్చితివా?

కల—ఇప్పుడును మాటడనియ్యను. ఊరకుండుము. ఓముద్దరాలా! ఇటురమ్ము నీ వీవరకు నాప్రభావ మెఱుఁగవు. నామాట వినఁబడినఁ బాఱుగువా రెవ్వరును వీధిలోనికి రారు. ఆమాట యటుండనిచ్చి నీవు చేయవలసినపనులు వినుము. నీవు ప్రతిదినమును జాముపొద్దుండఁగా లేచి ప్రాచిపనులు తీరిచి తెల్లవాఱునప్పటికి నాకొలఁవునకు రావలెను. సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమానమువఱకును జేయవలసినపనులన్నిటిని నీ కాలోచించి తరువాతఁ జెప్పెదను. ఇట్లంటినని సూర్యాస్తమానముతో నీదాస్యము ముగియునని సంతోషింపకుమా. రాత్రిపదిగడియలకు మేముపాన్పు చేరినతరువాత మా కాళ్ళుపట్టి మమ్ము నిద్రపుచ్చువఱకును నీ కేదో పని కల్పించి యెప్పటికప్పుడేదో చెప్పచుండెదరు. నీకొడుకడవులకుఁ బోయి యనుదినము తోడిబాలురతో సమిధలును బుష్పములును ఫలములును బత్రములును గొని తెచ్చుచుండవలెను.— మనవీధి నెవ్వఁడో మాలవాఁడు వచ్చుచున్నాఁడు. లోపలికిరా. నీపని యంతయు లోపల వివరముగాఁ జెప్పెదను.—ఓరి చండాలుఁడా! దగ్గఱగా వచ్చుచున్నావేమిరా? ఆగు. ఎవడవురా నీవు?

[అప్పుడు వీరబాహువు ప్రవేశించుచున్నాఁడు]

వీర—నేను వీరబాహుఁడను. వేగిరము లోపలికిఁ బొండి నేను పోవలెను.

కల—రండిరండి—మమ్ము లోపలికిబోనిమ్ము. ముఱికి పాతలును గల్లుపాయయు దోలుముక్కలును జూచుకొని యేమి పొంగిపడుచున్నావురా? (అందఱును లోపలికిఁ బోవుచున్నారు.)

వీర—(నిలువబడి తనలో) అయ్యో! నక్షత్రకుఁడును హరిశ్చంద్రుఁడును దామింతలోనే యీచోటుఁ బాసియెక్కడకుఁ బోయినారో! అతఁడు హరిశ్చంద్రుడన్న వార్త యీపట్టణ మేలెడు రాజునకుఁ దెలిసినపక్షమునఁ గోరినధన మిచ్చి యతఁడు హరిశ్చంద్రుని విడిపించును. అటువంటి వైపరీత్యము పుట్టకమునుపే నేను వారిని గలిసికొని విశ్వామిత్రుఁడు నాకిచ్చినధనముతో హరిశ్చంద్రుని వేగిరము కొనవలెను. అతఁడు నాచేతఁ జిక్కినా, విశ్వామిత్రుఁడు నాతోఁ జెప్పినదంతయుఁ జేసి యాతనిని బాధపెట్టెదను. (అని పయివంకఁజూచి) అదిగో వారీవంకనే వచ్చుచున్నారు.

[అప్పుడు నక్షత్రకుఁడును హరిశ్చంద్రుడును మరలఁ బ్రవేశించుచున్నారు.]

నక్ష—ఏవాడను దిరిగినను నిన్నెవ్వరును కొనకున్నారు. దైవము నిన్ను మాలవానికే దాసుఁడవు కమ్మని వ్రాసెను గాఁబోలును! మాలగూడె మీసమీపముననేయున్నఁదట! రమ్ము.

హరి—విధి నన్నేమి చేయఁదలఁచుకొన్నాఁడో యట్లు కాకమానదు. ఇక్కడ నొక్కసారి కేక వేయుము. (తనలో) నామనస్సున కారాటము హెచ్చుచున్నది.

నక్ష:—

గీ. సత్య మెప్పుడుఁ దప్పని సజ్జనుండు
పదుపురను మించి పనిచేయు బాహుబలుఁడు
వీని నిప్పుడు నేఁ జెప్పువెల రొసంగి
వచ్చి కొనరయ్య వేవేగఁ బౌరులార!

హరి—అయ్యో! ఈపగ లెంతదీర్ఘముగానున్నది! నేటిదినము సూర్యాస్తమానమే లేనట్లున్నదే! ఈ దినము సూర్యుఁడు క్రుంకఁడు. ఆహా! ఏమి యీవింత! ఎప్పుడును వెలుతురునే కోరుచుండెడు నేను నేఁడు చీఁకటిని గోరుచున్నాను!

మ. ధరఁ బ్రేమాస్పదులైనవారలు కడుం దవ్వైనచోఁ జాల సుం
దరమౌవస్తువుకూడఁ జిత్తమున కెన్నందా నసహ్యంబగున్;
కరముం జల్లనిపండువెన్నెలలునుం గల్గించు సంతాపమున్;
బెరుఁగం జేయని దేది దుఃఖమును బృథ్విన్ గష్టకాలంబునన్.

ఈ మనస్తాపమున కంతకును నా ప్రాణేశ్వరియే కారణము.

ఉ. ఇంతిరో! నీవు చెంత వసియించిన నెండయు వెన్నెలయ్యె; న
త్యంత సుగానమయ్యెను మదాత్మకు నీదుగళస్వనంబు; నీ
వింత యొసంగినట్టిఫలమెల్ల సుధాసమమయ్యె నప్డు; నా
కెంతయు నింద్రభోగసుఖ మిచ్చెను వింతగ నీదుస్పర్శయున్.

వీర—(సమీపించి) ఓ బ్రాహ్మణోత్తమా! నిలువునిలువు. నేను వచ్చుచున్నాఁడను.

నక్ష—నీ వెవఁడవు?

వీర—నేను వీరబాహుఁ డనుమాతంగుఁడను. నీవమ్మఁ జూపుచున్న యీతనిని గొనుటకయి వచ్చినాను. నీ కెంతధనము కావలెనో చెప్పుము.

నక్ష—నా కేనుఁగుమీఁద నెక్కి రత్న మెగమీటినంత యెత్తుధనము కుప్పవోసితివా, యీరాజును నీకు విక్రయించెదను.

వీర—ఈరా జేమిపనులు చేయును?

నక్ష—అన్నిపనులును జేయును-ఓరాజా! నీ వేమేమిపనులు చేయగలవో చెప్పు.

హరి—ఈతడు చెప్పిన న్యాయమయిన పనుల నన్నిఁటిని జేసెదను.

నక్ష—మఱియేపనులను జేయవా?

హరి—నామనస్సునకు మంచివి కావని బోధించుపనులను నే నెట్లు చేయఁగలను?

వీర—ఓవిప్రోత్తమా! ఇతఁ డేమనుచున్నాఁడో విన్నావా! అప్పుడే యితఁడు నేనుజెప్పినపనుల నన్నిటిని జేయననుచున్నాఁడు. తన మనస్సునకునచ్చినపనుల మాత్రమే చేయునఁట! ఇంతధన మిచ్చి కొని యిట్టిసేవకుని నే నేమిచేసుకోను?

నక్ష—ఓరాజా! రాకరాకవచ్చినబేరమును నీవిప్పుడు చెడఁగొట్టుచున్నావు. నన్నిట్లు చిక్కులు పెట్టి చంపుటకన్న ఋణము తీర్ప నిష్టము లేదనియే చెప్పరాదా?

హరి—సత్యముతప్పిన ధర్మహానివచ్చునని ధర్మమునిమిత్తమమ్ముడు పోవుచున్న నే నీతని నిమిత్తము ధర్మవిరుద్ధము లయిన పనులు చేయుదునా? ఈతఁడు తగవుమాలి యెవ్వరితల యయినఁ బగులగొట్టమన్నఁ గొట్టుదునా? ఎవ్వరిసొత్తయిన దొంగిలింపుమన్న దొంగిలి తెత్తునా?

వీర—అట్టి ధర్మబాహ్యములయినపనులు నే నెప్పుడును జెప్పను.

హరి—చెప్పకపోయినయెడల, నీయాజ్ఞలనన్నిటిని నేను శిరసావహించి చేసెదను.

వీర—నీవు మరి యేమి కోరికలు కోరెదవో యిప్పుడేచెప్పు. నీవు చెప్పెడిది నా కంగీకారమయినయెడల నిన్ను గొనెదను; లేదా, మానుకొనెదను.

హరి—నే నింకొక్క కోరిక కోరవలసి యున్నది. నేను స్వహస్తపాకముచేసికొని తినుచు దూరముగా నుండి నీసేవచేయుట కంగీకరింపవలయును. ఇంతకన్న వేఱుకోరికలు లేవు.

వీర—ఓ బాపనయ్యా! నేనీతఁడు చెప్పినదాని కంగీకరించితిని గాని నా మనస్సు నొక్కసంశయముమాత్రము బాధించుచున్నది. ఈతఁడాలుబిడ్డలు లేని యేకాకి. ఈతని నెట్లు నమ్మవచ్చును? ఉన్నట్టి యుండి యేయర్ధరాత్రి వేళనో యీతఁడు నన్నేమఱించి పాఱిపోయిన నేది దిక్కు? అప్పుడు నాధనము నాకిచ్చుట కెవ్వరయినఁ బూట పడువారున్నారా?

నక్ష—ఓ మాతంగపుంగవా! నీవట్టిసందేహము పెట్టుకోవలసిన పనిలేదు. దానమిచ్చిన ధనమును దీర్చుటకే భార్యాపుత్రులను బోఁగొట్టుకొని యేకాకియై యిట్లిడుములు బడుచున్నయీతఁడు నీవద్ద బుచ్చుకొన్నధన మపహరించి పాఱిపోవఁజూచునా? ఇట్టిపనికిమాలిన శంకలు మాని నీవీతనిని విశ్వసింపవచ్చును. ఒకవేళ నితఁడు మోసము చేసి నీధనమపహరించి పారిపోవునంతటివైపరీత్యమే పుట్టినపక్షమున నీ ధనము నీకు మరలఁ నిచ్చివేయుటకు నేను బూటపడెదను.

హరి—ఓ మాతంగపుంగవా! నే నొక్కమాటచెప్పెదను వినుము. సత్యపరిపాలనము నిమిత్తమే రాజ్యమంతయు విడిచి అరణ్యములపాలయి, భార్యాపుత్రులనుబోఁగొట్టుకొని, ఆత్మవిక్రయమునకు సహితము లోఁబడినాను. నీవద్ద భయభక్తులతో గొలువు చేసెదనని చెప్పుచున్నాను. కాఁబట్టి నాసత్యవాక్యమునందే గౌరవముంచి కోరినధన మీవిప్రకుమారున కిచ్చి పంపివేయుము.

వీర—ఇప్పుడు నీమీఁద నాకు విశ్వాసము కలిగినది. ఇఁక నాకర్ధభయములేదు.- ఓబ్రాహ్మణోత్తమా! నావెంట మాపల్లెకు రమ్ము. నీవిత్తమిచ్చెదను.

నక్ష—ఇదిగో వచ్చుచున్నాను. హరిశ్చంద్రా! ముందు నడువుము.

హరి—నడుచుచున్నాను—ఓవీరబాహూ! నేను నీయొద్దఁ జేయవలసినపని యేమి?

వీర—నే నీయూరి ప్రేతభూమికధికారిని. నేఁడు మొదలుకొని నాయాజ్ఞచేత నాయధికారమును నీవు వహించి, అహోరాత్రములందుఁ గనిపెట్టియుండవలెను. అక్కడ కాల్చుట కెవ్వరు శవమును దెచ్చినను కాటికట్న మొకమాడ పుచ్చుకొనక దహనము చేయ నీయఁగూడదు. నీయాజ్ఞ చెల్లుటకయి యిదిగో నీకునాముద్రగుదియ నిచ్చుచున్నాను. (అని తనచేతికత్తినిచ్చి) నీకిప్పుడు వీరదాసుఁడను పేరిచ్చుచున్నాను. నేఁటినుండి నీవీ పేరితో స్మశానవాటికయందు రాత్రిందివములు మిక్కిలి జాగరూకుఁడవయి యుండవలెను. ఈ కల్లుపంటిని నావెంటఁ గొనితెమ్ము. (అని కల్లుకుండ నిచ్చుచున్నాడు)

హరి—మీరు చెప్పినపని యెల్లను జేసెదను. (అని కల్లుపంటి పట్టుకొని నడుచుచున్నాఁడు)

వీర—ఓవీరదాసా! వేగిరము రమ్ము.

(అందరు నిష్క్రమించుచున్నారు)

పంచమాంకము

రంగము—స్మశానవాటిక

[వీరదాసుఁడును, తదనుచరుఁడగు మధుదాసుఁడును ప్రవేశించుచున్నారు]

మధు—ఓమహారాజా! దివ్యభవనములలో సంగీతారావములకానందించు చెవులతోఁ బితృవనములలో సృగాలారావము

లాలకించుచు, ఏనుఁగులను నడిపిన చేతులతోఁ బీనుఁగులను నడుపుచు, వీరదాసను పేరున మాలవాడలో నీవిప్పు డెంతకష్టపడవలసి వచ్చినది? ఇన్నికష్టము లనుభవించుచున్నను నీవు నిశ్చింతుఁడవై యుండుట చూడఁగా నాకాశ్చర్య మగుచున్నది.

వీర—ఓమధుదాసా! స్వామికార్య పరాయత్తచిత్తుఁడనయి కష్టములు మఱచియున్న నాకిప్పుడు పూర్వకష్టములను స్మరణకుఁ దెచ్చి దుఃఖము పుట్టింపకుము. అన్నికష్టములు వచ్చినను, వాని నన్నిటిని మఱపించుటకయి యాపదలయందు సహితము సత్యము విడువలేదన్న సంతోష మొక్కటే నాకుఁ జాలును. ఈసంతోషములో నాకేదుఃఖములును దోఁచవు. అయినను మానుషప్రకృతి యగుటచేత వెనుకటివిపత్తులు దలఁపునకు వచ్చినప్పుడుమాత్రము దుఃఖమాగదు. నీమాటలచేత నాదురవస్థ యిప్పుడు నాకుఁ దలఁపునకు వచ్చుచున్నది.

ఉ. నేనిఁట గాటికాపరికి నీచపుభృత్యుఁడనైతి నక్కటా!
తానును దాసి యయ్యె వసుధాసుర ధూర్తునియింటభార్యయున్;
భానుసమాన తేజుఁ డగుపట్టియు సేవకుఁ డయ్యె; నయ్యయో!
నే నెటు దుఃఖ మాపుకొన నేరుతు నిన్నియుఁ జిత్తమేపగన్? 1

(అని కన్నీరు విడుచుచున్నాఁడు)

మధు—ఓరాజేంద్రా! శోకమడచుకొమ్ము. ఆవంక నెవ్వరో మన సుంకమియ్యకయే దహనము నిమిత్తమై శవమును దింపినట్టున్నారు. పడమటికడను జూడుము.

వీర—స్వామికార్యము పేరుచెప్పఁగానే నాదుఃఖమంతయుఁ బాఱిపోయినది. మన మక్కడకుఁ బోయి కాటిరూక లియ్యక మనలను వంచింప నెంచిన యావంచకుల నదలింతము. (అని నిక్కి చూచి) ఇప్పుడు తెలిసినది. అది పశుకళేబరము కాని మనుష్యకళే

బరముకాదా. పశ్చిమమున వాలుచున్న సూర్యుని కిరణములచేత మనకన్నులు మిఱుమిట్లు గొని యాదిక్కున నున్నవానిని దిన్నగాఁ గానకున్నవి. ఎండకుఁ జే యడ్డము పెట్టుకొని యిప్పుడావంకఁ జూడుము.

మధు—(చూచి) అవు నవును. అది నేఁటి ప్రాతఃకాలమునఁ జచ్చినధేనువుయొక్క కళేబరము. ఆ మొండెమును లాగుచున్న కుక్కలను జూచి మనుష్యులని భ్రమపడినాను.

వీర—అట్టిభ్రమ మొదట నాకును గలిగినది. ఆశునకములు మోఁఅ లెత్తుకొని మొఱుఁగుచు నొకదానితో నొకటి యెట్లు కలహించుచున్నవో చూడు.

మధు—అట్లు పోరుచున్న వొక్క కుక్కలు మాత్రమే కావు. రాజ్యభాగమునిమిత్తమయి యుద్ధముచేయు వీరభటులవలెనే మాంసభాగమునిమిత్తమయియాకాశమున కెగసి కాకులును యుద్ధయు చేయుచున్నవి.

వీర—వట్టియఱపులే కాని కాకులలోఁ గాట్లాటలంతగా లేవు.

చ. మనుజుల కైకమత్యమును మన్నన నేరువు చున్నవో యనన్
గనుఁగొను మామహీజములఁ గాకులుగుంపులుకూడియుండొరుల్
ఘనమతిఁ బిల్చుచున్ బిశితఖండము లల్లన నారగించెదుర్
దునుకలు కాళ్ళక్రింద నిడి తోటిపుటంబులఁజించి చీల్చుచుర్. 2

మధు—అవి యట్లే యున్నవి. రెండును ద్విజాతులేయైనను గాకుల కున్న యైకమత్యము గ్రద్దలకుఁ గానరాకున్నది. అవి నోరెత్తి యొకదాని నొకటి పిలిచిన పాపమునఁ బోకున్నవి.

వీర—ఆగ్రద్దలను నిపుణముగాఁ గనిపెట్టుము.

ఉ. గ్రద్దలు కొన్ని చంచువుసఁ గట్టిగ మాంసము లాగి మెక్కఁగాఁ
దద్దయు మండలాకృతిని దవ్వుల మింటఁ బరిభ్రమించుచున్

గ్రద్దలు కొన్ని చూచి తమకంబున నోళ్ళను విప్పి ఱెక్కలన్
బెద్దయుఁ జాచి వేఁదిగెడు బీనుఁగుమీఁదికిఁ జూడు మాదెసన్.

మధు—ఇటు మనము మాటాడుచుండఁగానే సమస్తవస్తువులు నెఱ్ఱపడుచున్నవి. ఆకాశమునుండి మేఘములు రక్తవర్షము కురియుచున్నవా యేమి?

వీర—ఓయీ! నీ విప్పుడు సాయంకాల మగుచున్న దన్నమాట మఱచిపోయినావు. సూర్యుఁడు తనకిరణముల వేఁడిమిని బోఁగొట్టుకొని శాంతమూర్తియయి పశ్చిమమునఁ గ్రుంకఁబోవుచున్నాఁడు. నీ విప్పుడు చూచినది సంధ్యారాగముగాని రక్తవర్షము కాదు. ఇప్పుడు సూర్యుఁ డెంత మనోహరముగా నున్నాఁడో చూచినావా?

క. అమ్మార్తాండుని దెసఁగనుఁ
గొమ్మామూలాగ్ర మొక్కకుప్పగ నత్యం
తమ్ముఁ జిగిర్చిన యెఱ్ఱని
క్రొమ్మామిడిగున్నవంటి కొమరువహించెన్. 4

కాఱుక్రమ్ముకొనుచున్న యీకటికచీఁకట్లు పల్లవభక్షణాపేక్షచేతఁ జనుదెంచుచున్న కోయిలగుంపులవలె నున్నవి.

మధు—నాదృష్టి కెఱ్ఱనైన యీసూర్యబింబము మండుచున్న పొదగాను, చీఁకట్లు దానిపయి పొగలుగాను, నక్షత్రములంనుండి లేచిన మిణుఁగురులుగాను, పొడకట్టుచున్నవి.

వీర—కాటికాపరివాఁడవగుటచే నీమనస్సెప్పుడును జితులమీఁదను, శవములమీఁదను, మంటలమీఁదనే యుండును. అందుచేత నీకుసర్వమును కాష్ఠమయముగానే తోఁచుట యాశ్చర్యము కాదు. ఆహా! మనము చూచుచుండఁగానే యెంతలో గాఢాంధకారము వ్యాపించి కన్నులు నిరర్థకములయి మిట్టపల్లము తెలియఁగ

రాక మిన్నును మన్నును నేకమయిపోయినవి! నీ వొక్కగడియ సేపిందుఁ గూరుచుండి యప్రమత్తుఁడవై కాచియుండుము. నేనింతలో సాయం కాలకృత్యములను దీర్చుకొనివచ్చి స్వామి కార్యతత్పరుఁడ నయ్యెదను.

మధు—నీవు పోయిరమ్ము. నీవుమరల వచ్చువఱకును నేను గనిపెట్టియుండెదను.

వీర—పోయివచ్చెదను. నీవు క్షణకాలమయిన నేమఱి యుండఁగూడదునుమా. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

మధు—అయ్యో! నాకప్పుడే యావులింతలు వచ్చుచున్నవి; రెప్పలుమూసికొనిపోవుచున్నవి. ఈలోపల నొక్కనిద్రతీసి వీరదాసు మరల వచ్చునప్పటికి మేలుకొని కావలి కాచుచుండెదను.

(మంచెకుఁ జేరగిలఁబడి నిద్రపోవుచున్నాఁడు.)

[అప్పుడు లోహితాస్యుని భుజముమీఁద వేసికొని విలపించుచునొక్క బ్రాహ్మణబాలకుఁడు వెంటరాఁగా చంద్రమతి ప్రవేశించుచున్నది.]

బాల—అమ్మా! మన మిప్పుడు స్మశానవాటికకువచ్చినాము. మనమేఱుకొనివచ్చినచితుకలతో సొదఁ బేర్చి యీలోహితాస్యున కిక్కడ దహనసంస్కారము చేయవచ్చును.

చంద్ర—(లోహితాస్యుని దింపి యాతనివంకఁ జూచుచు) నాకన్నతండ్రీ! ఓలోహితా! నేనెంత పిలిచినను నాతో మాటాడ వేమి? బ్రాహ్మణుని నిమిత్తమయి నీవు విఱిచినసమిధ లిప్పుడు నీకే వినియోగపడవలసివచ్చినవా? "ఓవిప్రవరా! మీయాజ్ఞ చొప్పున నరణ్యమునకుఁ బోయి సమిత్కుశాదులను దెచ్చితి"నని యింకగాల కౌశికున కెవ్వ రర్పింతురు! ఫలపర్ణకుశాదులు తక్కువ తెచ్చితి వని కాలకౌశికులు కోపపడి కొట్టితిట్టెనని కన్నుల నీరుగార నేడ్చుచు వచ్చి యిప్పుడు నాతోఁజెప్ప వేమి?